ఆదివారం
28-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 08
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రజావేగు ఆత్మహత్య...
50 వేల డాలర్లతో బోయింగ్ సెటిల్‌మెంట్

వాషింగ్టన్: బోయింగ్ విమానాల తయారీలో నాణ్యతా లోపాలను ఎత్తిచూపిన మాజీ ఉద్యోగి జాన్ బార్నెట్ అనుమానాస్పద మృతి అప్పట్లో సంచలనమైంది ఆ మరణానికి కంపెనీ చర్యలు కారణమంటూ బార్నెట్ కుటుంబం వేసిన దావాను బోయింగ్ సెటిల్ చేసుకుంది. 50వేల డాలర్లు (రూ. 44,36,500) ఇచ్చి ఈ కేసు ముగించేందుకు అంగీకరించింది. అందులో 20వేల డాలర్లు చట్టపరమైన ఖర్చుల కింద చెల్లించనుంది. మిగిలినది కుటుంబ సభ్యులకు వెళ్లనుంది. బోయింగ్- 787 డ్రీమ్‌లైనర్ తయారు చేసే దక్షిణ చార్లెస్టన్ ప్లాంటులో బార్నెట్ 2010 నుంచి క్వాలిటీ మేనేజర్‌గా పనిచేశారు.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం

ఐరాస: భారత దేశానికి పొరుగు దేశం భూటాన్ బాసటగా నిలిచింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని కోరింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80వ సమావేశంలో భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గే భద్రతా మండలి లో ప్రధాన సంస్కరణల కోసం గట్టిగా మాట్లాడారు. మారుతున్న ప్రపంచ వాస్తవికతను దృష్టిలో ఉంచుకుని భారతదేశం, జపాన్ వంటి అర్హతగల దేశాలకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ డిమాండ్‌ను భారతదేశం చాలా కాలంగా

- మిగతా 2 లో

అండమాన్‌లో భారీగా 'సహజ వాయువు'

న్యూఢిల్లీ: దేశంలో మొదటిసారిగా అండమాన్ సముద్రంలో "సహజ వాయువు" నిక్షేపాలున్నట్లు వెల్లడైంది. ఆయిల్ ఇండియా లిమిటెడ్ శ్రీ విజయపురం-2 బావి వద్ద గ్యాస్‌ను కనుగొంది. ప్రాథమిక పరీక్షల్లో 87 శాతం మీథేన్ ఉన్నట్లు తేలింది. గతంలో ఈ ప్రాంతంలో సంభావ్య చమురు నిక్షేపాలు ఉన్నట్లు వెల్లడైంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను, ఇంధన మార్కెట్‌ను గణనీయంగా మారుస్తుంది. అండమాన్ దీవుల తూర్పు తీరంలో 17 కి.మీ

- మిగతా 2 లో

పీఓకేలో పాక్ వ్యతిరేక నిరసనలు

శ్రీనగర్: పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు. పాక్ ప్రభుత్వం, సైన్యానికి వ్యతిరేకంగా శనివారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. వేల సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. వీరిని అణిచివేసేందుకు పాక్ ఆర్మీ, పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పాకిస్థాన్ ఆర్మీ ప్రజల్ని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. పీఓకేలోని కోట్లీలో పాక్ సైన్యం కాల్పులు జరిపింది. ఈ ఘటనలో

- మిగతా 2 లో

ఘోర విషాదం

33 మందికి పైగా మృతి

తమిళనాట విజయ్ ర్యాలీలో తొక్కిసలాట

50 మంది పరిస్థితి విషమం

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

కరూర్ : తమిళ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుంది. కరూర్‌లో శనివారం విజయ్ నిర్వహించిన ర్యాలీకి భారీగా ప్రజలు హాజరయ్యారు. ఈ సమయంలోనే తొక్కిసలాట జరిగింది. మొత్తం 33 మందికి పైగా మరణించారు. మృతుల్లో

- మిగతా 2 లో

ముంచేసిన మూసి

- బస్తీలు, కాలనీలు జలమయం
- బ్రిడ్జిలపై రాకపోకలు నిలిపివేత
- పునరావాసాలకు బాధితుల తరలింపు
- ముసారాంబాగ్ బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన సెంట్రింగ్

విశాలాంధ్ర-హైదరాబాద్: భాగ్యనగరాన్ని మరోసారి వరణుడు ముంచెత్తాడు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మూసీ ఉగ్రరూపం దాల్చడంతో వివిధ ప్రాంతాలు నీట మునిగాయి. నది పక్కనే ఉన్న బస్తీల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడం... జంట జలాశయాల గేట్లు తెరవడంతో మూసీలో వరద ప్రవాహం ఉధృతంగా పెరిగింది. మూసీపై

- మిగతా 2 లో

తెలంగాణ పునర్నిర్మాణంలో
యువత భాగస్వామ్యం

- డ్రగ్స్, గంజాయికి బానిసకావొద్దు
- ఏటీసీ విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటీస్: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ పునర్నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నట్టు పేర్కొన్నారు. మల్లెపల్లిలో శనివారం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మొట్ట మొదట 1956 లో ఐటీఐలను ప్రారంభించారని గుర్తు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాన్ని అందించాలన్న ఆలోచన గత ప్రభుత్వాలు చేయలేదన్నారు. కోర్సులను అప్ గ్రేడ్ చేయకపోవడంతో ఐటీఐలు నిర్వీర్యమయ్యాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఐటీఐలను పునరుద్ధరించాలని నిర్ణయించి ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ)గా అప్ గ్రేడ్ చేశామని వివరించారు. రాష్ట్రంలో 65 ఏటీసీలను పూర్తి చేశాం, మరో 51 ఏటీసీలను మంజూరు చేశామని తెలిపారు. ఏడాదిలోగా 51 ఏటీసీల నిర్మాణం పూర్తి చేస్తామని, నైపుణ్యం లేకపోతే సర్టిఫికెట్లు ఎందుకూ ఉపయోగపడవన్నారు. యువతకు

- మిగతా 2 లో

వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలి

- ప్రజాస్వామ్య గొంతుకల అణచివేత తగదు
- సీపీఐ డిమాండ్

న్యూఢిల్లీ : లద్దాఖ్‌లో ఇటీవల జరిగిన నిరసనల తరువాత జాతీయ భద్రతా చట్టం కింద ప్రము ఖ విద్యావేత్త, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రహోదా, రాజ్యాంగ రక్షణ కోసం శాంతియుతంగా ప్రజా స్వామ్య డిమాండ్లను లేవనెత్తు తున్న పౌరుడిపై ఇటువంటి కఠిన చట్టాన్ని ప్రయోగించడం ఆమోదయోగ్యం కాదని, అధికార దుర్వినియో గమేనని విమర్శించింది. లద్దాఖ్ ప్రజల హక్కులను దెబ్బతీయడమే కాకుండా అసమ్మతిని నేరంగా పరిగణించి ప్రజాస్వామ్య గొంతు కలను అణచివేసే ప్రమాదకర మైన ధోరణిని కూడా ప్రతిబిం బిస్తోందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. నిరసన లకు సంబంధించి

- మిగతా 2 లో

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు
తరలించండి

- మూసీ లోతట్టులో జాగ్రత్తలు తీసుకోవాలి
- ప్రయాణికులను ప్రత్యామ్నాయ రూట్లకు మళ్లించండి
- అధికారులు అందుబాటులో ఉండాలి: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మూసీ వెంబడి లోతట్టు ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వరుసగా వర్షాలు, వరదలతో జంట జలాశయాల గేట్లు ఎత్తడం, మూసీకి వరద నీటి ప్రవాహం పెరగటంతో నది పరివాహం వెంబడి ఉన్న పరిస్థితిని ముఖ్యమంత్రి శనివారం అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఎంజీబీఎస్ బస్టాండ్ చుట్టూ నీళ్లు రావటంతో అక్కడున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకు వచ్చేందుకు చేపట్టిన సహాయక చర్యలను సీఎం

- మిగతా 2 లో

భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్
- హోంశాఖ కార్యదర్శిగా సీవీ ఆనంద్

విశాలాంధ్ర - హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల వేళ భారీగా ఐఏఎస్, ఐపీఎస్ లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా వీసీ సజ్జనార్, హోంశాఖ కార్యదర్శిగా సీవీ ఆనంద్‌ను నియమించినట్టు ప్రభుత్వం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇవి చదివి నువ్వు కూడా
తిక్క తిక్క వాగుడు వాగు!
అందరూ మెచ్చుకుంటారు.

బీసీ రిజర్వేషన్లపై విచారణ 8కి వాయిదా

విశాలాంధ్ర-హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై చట్టప్రకారమే ముందుకెళ్లాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శనివారం జస్టిస్ అభినందన్ కుమార్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 42 శాతానికి పెంచారని, దీంతో మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60శాతానికి పైగా దాటిందని పిటిషనర్ తెలిపారు. రాజ్యాంగంలో 50శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50శాతమే ఉండాలని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ల పరిమితి 67 శాతానికి చేరిందన్నారు. బీసీ రిజర్వేషన్లు 35 శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారని తెలిపారు. 2018లో ఇచ్చిన జీవోను ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందన్నారు. తమిళనాడులో రిజర్వేషన్లు 69శాతానికి పెంచారు కదా అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి రిజర్వేషన్ పెంచారని, ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో

- మిగతా 2 లో

పలస్తీనా దేశం ఏర్పాటు ఇజ్రాయిల్‌కు ఆత్మహత్య వంటిది

ఐరాసాలో నెతన్యాహు తీవ్ర వ్యాఖ్యలు
నిరసనగా వివిధ దేశాల ప్రతినిధుల వాకౌట్

ఐరాస: ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఐక్యరాజ్య సమితిలో చేసిన ఆవేశపూరిత ప్రసంగం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. పలస్తీనా దేశం ఏర్పాటును తాను గట్టిగా అడ్డుకు ంటానని స్పష్టం చేస్తూ... ఈ విషయంలో తమ దేశంపై ఒత్తిడి తెస్తున్న పశ్చిమ దేశాలను, యూరోపి యన్ నాయకులను తీవ్రంగా విమర్శించారు. ఒక పలస్తీనా దేశం ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా వారు ఇజ్రాయిల్ మొత్తాన్ని ఆత్మ హత్య చేసుకునేలా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా హమాస్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన తమ మిలిటరీ ఆపరేషన్‌ను త్వరలోనే పూర్తి చేస్తానని శపథం చేశారు. బ్రిటన్, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాలు ఇటీవల పలస్తీనాను దేశంగా గుర్తించిన నేపథ్యంలో నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేయడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చర్యలు "యూదులను హత్య చేయడం లాభదాయకం" అనే సందేశాన్ని పంపాయని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇజ్రాయిల్ ఎప్పటికీ తమ గొంతులోకి ఓ ఉగ్రవాద దేశాన్ని నెట్టడానికి అనుమతించదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాగే తమ దేశం జాతీయ ఆత్మహత్యకు పాల్పడదని, కేవలం మీడియా ఒత్తిడికి, యూదు వ్యతిరేక గుంపులకు భయపడి తమ నిర్ణయాలను మార్చుకోబోమని ఆయన స్పష్టం చేశారు. గతేడాది అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దారుణ దాడికి ప్రతీకారంగా.. ఇజ్రాయిల్ సైన్యం గాజాలో విస్తృత స్థాయిలో మిలిటరీ ఆపరేషన్ చేపట్టింది. ఈ దాడిలో 1,219 మంది ఇజ్రాయిల్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అయితే ఆ తర్వాత ఇజ్రాయిల్ చేపట్టిన సైనిక చర్యలో ఇప్పటి వరకు 65,549 మందికి పైగా పలస్తీనియన్లు (వారిలో ఎక్కువ మంది సామాన్య పౌరులే) మరణించినట్లు ఐరాస విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆయన ప్రసంగం ఐరాసలో తీవ్ర వ్యతిరేకతకు దారి తీసింది. నెతన్యాహు ప్రసంగిస్తున్న సమయంలోనే వివిధ దేశాల ప్రతినిధులు ఆయనకు నిరసనగా వాకౌట్ చేశారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) నుంచి యుద్ధ నేరాల కేసులో అరెస్ట్ వారెంట్ ఎదుర్కొంటున్న నెతన్యాహు.. న్యూయార్క్ వెళ్లడానికి కూడా అసాధారణమైన సుదీర్ఘ మార్గంలో ప్రయాణించాల్సి వచ్చింది. ఆయన బస చేసిన హోటల్ బయట, ఐరాస ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసనకారులు ప్రదర్శనలు నిర్వహించారు. నెతన్యాహు తన ప్రసంగంలో గాజాలో తాము మారణహోమం సృష్టిస్తున్నామన్న ఆరోపణలను బలంగా ఖండించారు. అయితే ప్రజలను బలవంతంగా వేరే ప్రాంతానికి పంపించడం కూడా యుద్ధ నేరమే అవుతుందని అంతర్జాతీయ మానవతా చట్టాలు చెబుతాయని వివిధ సంస్థలు గుర్తుచేశాయి. ఈ యుద్ధంలో గాజాలోని దాదాపు

మొత్తం జనాభా నిరాశ్రయులయ్యారు. ఆయన ప్రసంగం గాజాలోని కొన్ని ప్రాంతాల్లో ఇజ్రాయిల్ సైన్యం ఏర్పాటు చేసిన లౌడ్‌స్పీకర్ల ద్వారా కూడా ప్రసారం చేశారని నెతన్యాహు తెలిపారు. తాము హమాస్ నాయకులను, బందీలను ఒక్క క్షణం కూడా మర్చిపోలేదని ఆయన హీబ్రూ భాషలో పేర్కొన్నారు.

వృద్ధ నేతల వల్లనే సమస్యలు: ఒబామా

లండన్: ప్రపంచ సమస్యల్లో 80 శాతం వృద్ధ నేతలు అధికారాన్ని పట్టుకుని వేలాడడం వల్లే వస్తున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వ్యాఖ్యానించారు. పిరమిడ్లతో సహా ప్రతిదానిపైనా తమ పేర్లను చెక్కడం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. 77 ఏళ్ల వయసులో అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఒబామా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రిటిష్ చరిత్రకారుడు డేవిడ్ ఒలుసొగాతో జరిగిన సంభాషణలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచ సమస్యలలో 80 శాతం- మరణానికి భయపడే వృద్ధులు అధికారాన్ని పట్టుకుని వేలాడుతూ ఉండడం వల్లే అని చెప్పడం సముచితం. వారు ఏదీ వదులుకోరు. వారు పిరమిడ్‌లను నిర్మిస్తారు. వారు ప్రతిదానిపైనా తమ పేర్లను ఉంచుతారు" అని అన్నారు. ఇంతకుముందు వాషింగ్టన్ డీసీలో నేషనల్ గార్డ్ దళాలను మోహరించాలనే తన నిర్ణయాన్ని డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. దేశ రాజధానిలో హింసాత్మక నేరాల పెరుగుదలను అరికట్టడానికి అసాధారణ చర్యలు అవసరం అని స్పష్టం చేశారు. ఇది జరిగిన నెల రోజుల తర్వాత ఒబామా ఈ

వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2018 నుంచి 2017 వరకు అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన బరాక్ ఒబామా 2019లోనూ వృద్ధ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "సాధారణంగా వృద్ధులు, ముఖ్యంగా బాగా ముదిరిపోయిన వాళ్లు, అధికారం అనే మార్గం నుంచి బయటకు వెళ్లరు" అని ఒబామా వ్యాఖ్యానించారు.

ఎప్‌స్టైయిన్ ఫైళ్లలో ఎలాన్ మస్క్ పేరు

వాషింగ్టన్: అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణంలో నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టైయిన్ కేసుకు సంబంధించి మరో ఆసక్తికర విషయం వెలుగు చూసింది. ఆయనకు సంబంధించిన ఫైళ్లను తాజాగా అమెరికా ప్రభుత్వం విడుదల చేయగా... అందులో ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పేరు కూడా ఉంది. ప్రస్తుతం ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2014 డిసెంబరు 6న ఎప్‌స్టైయిన్‌ప్రైవేటు ద్వీపంలో మస్క్ పర్యటనను షెడ్యూల్ చేసినట్లు ఆ పత్రాల్లో ఉన్నట్లు సమాచారం. అయితే, మస్క్ అక్కడ పర్యటించారా లేదా అనేది నిర్ధారణ కాలేదు. ఎప్‌స్టైయిన్ ఫైళ్లలో తన పేరు ఉండటాన్ని మస్క్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక.. తాజా ఫైళ్లలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన స్టీవ్ బానన్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేర్లు కూడా ఉన్నాయి. ఎప్‌స్టైయిన్ తో వీరి అల్పాహార భేటీకి షెడ్యూల్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఇటీవల ట్రంప్‌తో విభేదాల నేపథ్యంలో మస్క్, అధ్యక్షుడు ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఎప్‌స్టైయిన్‌కు

సంబంధించిన ఫైళ్లలో ట్రంప్ పేరు ఉందని, అందుకే దర్యాప్తులో వెల్లడైన విషయాలను బయటపెట్టడం లేదని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో దీనికి సంబంధించిన నిజానిజాలను బయటపెడతానంటూ పోస్టు పెట్టారు. తర్వాత మస్క్ ఆ పోస్టును తొలగించారు. ఈ క్రమంలోనే ఎప్‌స్టైయిన్ ఫైళ్లలో ట్రంప్ పేరు ఉన్నట్లు ఇటీవల వెల్లడైంది. తాజాగా మస్క్ పేరు కూడా బయటకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం

(మొదటిపేజీ తరువాయి)

లేవనెత్తుతుండగా... ఇటీవల బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో కూడా ఈ డిమాండ్‌కు ఆమోదం లభించింది. ఐరాస భద్రతా మండలి కేవలం ప్రదర్శనగా ఉండకూడదని, ప్రపంచ వాస్తవ సవాళ్లను పరిష్కరించే ప్రభావవంతమైన శక్తిగా మారాలని భూటాన్ ప్రధాన మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రతా మండలి విస్తరణతో సహా ఐరాస సంస్కరణలకు భూటాన్ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. సంస్కరించిన భద్రతా మండలిలో భారతదేశం, జపాన్ వంటి అర్హత గల ప్రముఖ దేశాలు ఉండాలని అన్నారు. ఇటీవల సమావేశంలో చైనా, రష్యా కూడా భారతదేశం, బ్రెజిల్ భద్రతా మండలిలో బలమైన పాత్ర పోషించడాన్ని చూడాలనుకుంటున్నాయని పునరుద్ఘాటించాయి.

అండమాన్‌లో భారీగా 'సహజ వాయువు'

(మొదటిపేజీ తరువాయి)

దూరంలో 295 మీటర్ల నీటి లోతు, 2650 మీటర్ల టార్గెటెడ్ లోతులో ఉన్న శ్రీ విజయంపురం-2 బావి వద్ద ఈ నిక్షేపాలను గుర్తించినట్లు కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటించారు. ఈ ప్రాంతంలో 2 లక్షల కోట్ల లీటర్ల భారీ చమురు నిల్వలు ఉండే అవకాశాన్ని మంత్రి హైలెట్ చేశారు. ఇది వెలికితీస్తే భారత ఆర్థిక వ్యవస్థ ఏకంగా 20 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. దిగుమతులపై ఆధారపడకుండా, ఇంధన భద్రతను పెంచడంతో పాటు చమురు, గ్యాస్ ఉత్పత్తిలో స్వావలంబనకు ఈ నిక్షేపాలు సహాయపడుతాయి. ఈ నాచురల్ గ్యాస్ నిక్షేపాలను గుర్తించడానికి ముందు జూన్ నెలలో హర్దీప్ సింగ్ మాట్లాడుతూ... అండమాన్‌లో గయానా పరిణామంలో భారీ చమురు నిక్షేపాలు ఉన్నట్లు చెప్పారు.

పీఓకేలో పాక్ వ్యతిరేక నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

చాలా మంది గాయపడినట్లు సమాచారం. మరణాల వివరాలు ఇంకా తెలియరాలేదు. ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం, పర్యాటకుల్ని పీఓకే వెళ్లవద్దని సూచించింది. జర్నలిస్టులు, మీడియా పీఓకేలోకి ప్రవేశించకుండా నిషేధించింది. పీఓకేలో 2000 మంది పోలీస్ సిబ్బంది, 167 ఎఫ్సీ ప్లాటూన్లను మోహరించినట్లు తెలుస్తోంది. తమ ప్రాంతంలోని వనరుల్ని పాకిస్థాన్ దోచుకుని వెళ్తుందని పీఓకే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నిరసనలు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నేతృత్వంలో కొనసాగుతున్నాయి. షాబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి, ఆసిమ్ మునీర్ నేతృత్వంలోని సైన్యానికి వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేస్తున్నారు. పీఓకేలో ఇలా నిరసనలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలో రావల్ కోట్‌లో పాక్ ఆర్మీపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసిమ్ మునీర్, షరీఫ్ లు ట్రంప్ చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నట్లు మండిపడ్డారు.

బీసీ రిజర్వేషన్లపై విచారణ 8కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

విచారణలో ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏ సవరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని, ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు.

పెండింగ్‌లో ఉన్న అంశంపై జీవో ఎలా జారీ చేస్తారని హైకోర్టు... ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వం నిర్ణయం చెప్పేందుకు రెండురోజుల సమయం కావాలని ఏజీ కోరగా... హైకోర్టు అనుమతిచ్చింది. అక్టోబరు ఆరో తేదీ వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా అని.. ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు ఎనిమిదో తేదీకి వాయిదా వేసింది.

భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన విడుదల చేసింది. గతంలో కూడా సజ్జనార్ హైదరాబాద్ సీపీగా పనిచేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విజయ్‌కుమార్, ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి, అగ్నిమాపక డీజీగా విక్రమ్‌సింగ్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా రఘునందన్‌రావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్, గ్రేహౌండ్స్ ఏడీజీగా అనిల్ కుమార్, హైదరాబాద్ క్రైమ్స్ అడిషనల్ సీపీగా శ్రీనివాసులు, హైదరాబాద్ అడిషనల్ శాంతిభద్రతల సీపీగా తఫ్సీర్ ఇక్బాల్, వెస్ట్‌జోన్ డీసీపీగా అనురాధ, సిద్దిపేట సీపీగా విజయ్‌కుమార్, నారాయణపేట ఎస్పీగా వినీత్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సింధు శర్మ, రాజేంద్రనగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్, మాదాపూర్ డీసీపీగా రీతిరాజ్ నియమితులయ్యారు. సురేంద్ర మోహన్‌కు వ్యవసాయశాఖ బాధ్యతలు అప్పగించింది.

రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా హరిత, స్పెషల్ సెక్రటరీగా సందీప్‌కుమార్ ఝా, పౌరసరఫరాల కమిషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర, జీఏడీ పొలిటికల్ సెక్రటరీగా రిజ్వీ నియమితులయ్యారు.

ఘోర విషాదం

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురు పిల్లలు ఉన్నారు. పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. 40 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని కరూర్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తమిళగా వెట్రీ కజగం (టీవీకే) మద్దతుదారులు, విజయ్ అభిమానులు భారీ సంఖ్యలో రావడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. విజయ్ ఈ ర్యాలీకి దాదాపుగా 6 గంటలు ఆలస్యంగా వచ్చారని తెలుస్తోంది. తొక్కసలాటపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ర్యాలీలో చిన్నారి తప్పిపోయిందనే వార్త రాగానే, ఒక్కసారిగా జనాలు తోసుకోవడం ప్రారంభించారు. దీంతో పరిస్థితి అదుపు తప్పినట్లు తెలుస్తోంది. 10,000 మందితో ర్యాలీకి విజయ్ అనుమతి తీసుకున్నారు. అయితే, ఊహించని రీతిలో జనాలు తరలివచ్చారు. ఇదే మొత్తం ఘటనకు కారణమైనట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తొక్కిసలాట ఘటనతో విజయ్ తన ప్రసంగాన్ని అకస్మాత్తుగా ముగించాల్సి వచ్చింది. ప్రేక్షకులలో చాలా మంది స్పృహ కోల్పోవడంతో అంబులెన్స్‌లలో తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ గందరగోళం సమయంలో వేదిక నుంచి విజయ్ 'పోలీసులు దయచేసి సహాయం చేయండి' అని విజ్ఞప్తి చేయడం వినిపించింది. జనంలో ఒక పిల్లవాడు కనిపించకుండా పోయినట్లు తెలుస్తోంది. విజయ్ మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా జనం అదుపు తప్పారు. పార్టీ కార్యకర్తలు, పిల్లలు సహా చాలా మంది అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గందరగోళాన్ని గమనించిన విజయ్ తన ప్రసంగాన్ని ఆపి, తన ప్రచార బస్సు పై నుంచి జనం పైకి నీటి సీసాలు విసిరి, ప్రశాంతంగా ఉండమని విజ్ఞప్తి చేశాడు. కాగా, స్పృహ కోల్పోయిన వారిని చేరుకోవడానికి అంబులెన్స్‌లు రద్దీగా ఉన్న రహదారి గుండా వెళ్లడం కష్టమైంది. బాధిత వ్యక్తులను తరువాత సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. పరిస్థితి తీవ్రతను అంచనా వేసిన తర్వాత విజయ్ తన ప్రసంగాన్ని షెడ్యూల్ కంటే ముందే ముగించాడు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'కరూర్ నుంచి వస్తోన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు అన్ని రకాల సాయం అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి, కలెక్టర్‌కు సూచించా. కరూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించా. వైద్యులు, పోలీసులకు సహకరించాలని కరూర్ పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నా' అని ముఖ్యమంత్రి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్బంధించబడిన సోనమ్ వాంగ్‌చుక్, ఇతర కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని, వారిపై ఉన్న అన్ని తప్పుడు, కల్పిత అభియోగాలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, లెహ్‌లో జరిగిన కాల్పుల సంఘటనపై స్వతంత్ర, పారదర్శక విచారణ జరగాలని, బాధ్యులు జవాబుదారీగా ఉంచాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఏకపక్షంగా ఆర్టికల్ 370ని రద్దు చేసి, పూర్వపు జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన బీజేపీ ప్రభుత్వం... ఈ వ్యూహాత్మకంగా సున్నితమైన ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న కల్లోలం, కష్టాలకు ప్రత్యక్ష బాధ్యత వహించాలని, దానికి జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేసింది. అదే సమయంలో లద్దాఖ్‌లో అన్ని వర్గాల వారితో అర్థవంతమైన సంభాషణను ప్రారంభించాలని, ప్రజలలో సాధారణ స్థితి, శాంతి, విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

యువత భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

నైపుణ్యం అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి సమాజానికి పట్టిన చీడ అని, వ్యసనాలకు బానిస కాకకండి... తల్లిదండ్రులకు బాధను మిగల్చకండని సూచించారు. ఏటీసీలలో చదువుకున్న విద్యార్థులకు ఆర్టీసీలో అప్రంటీస్ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఏటీసీలలో చదివే విద్యార్థులకు ప్రతి నెలా రూ.రెండు వేలు స్కాలర్ షిప్ అందిచేలా ఆర్థిక మంత్రిని ఒప్పించి ఇప్పించాలని శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేశారు. మన యువతకు జపనీస్ నేర్పిస్తే అక్కడ ఉద్యోగ అవకాశాలను ఇచ్చేందుకు జపాన్ సిద్ధంగా ఉందన్నారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని, మీ భవిష్యత్ కు పునాదులు వేస్తామని భరోసా ఇచ్చారు.

యువతకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం: శ్రీధర్ బాబు

స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తెలంగాణను తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య స్కిల్స్ విషయంలో ఏర్పడిన అంతరాన్ని పూడ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ యువత అత్యంత ప్రతిభావంతులు, ఇదే మనకున్న పెద్ద ఆస్తి, వారికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని, గత ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసింది. ఆ తప్పులను మేం ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశాం. 60 వేలకు పైగా ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేశామన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

(మొదటిపేజీ తరువాయి)

స్వయంగా సమీక్షించారు. ఎప్పటికప్పుడు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్కడి నుంచి బయటకు తీసుకు వచ్చే ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంజీబీఎస్‌కు వచ్చే బస్సులను ప్రత్యామ్నాయ రూట్లకు మళ్లించాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ, దసరా పండుగల వేళ కావటంతో వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ విభాగం తగిన చర్యలు చేపట్టాలన్నారు. వరుసగా రెండో రోజు కూడా హైదరాబాద్‌లో భారీ వర్ష సూచన ఉండటంతో పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీఎచ్‌ఎంసీ, విద్యుత్తు విభాగాలన్నీ అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో నీళ్లు నిలిచే ప్రాంతాలు, మూసీ ప్రమాదకరంగా ప్రవహించే ప్రాంతాల్లో అధికారులు ప్రజలను హెచ్చరించేలా బోర్డులు పెట్టాలని, అటు వైపు వాహనాలు, ప్రజలు వెళ్లకుండా దారి మళ్లించాలని సూచించారు.

పునరావాస కేంద్రాలకు నిర్వాసితులు: పొన్నం

భారీ వర్షాలు, వరదలతో నగరంలో జంట జలశయాల గేట్లు ఎత్తడం వల్ల మూసీ పరివాహక ప్రాంతాల్లో ముంపునకు గురైన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. జీహెచ్‌హెచ్ తాత్కాలిక పునరావాస కేంద్రాల్లో ఇప్పటి వరకు శంకర్ నగర్ ప్రాంతంలోని దాదాపు 500 మంది నిర్వాసితులు షాజాదీ మసీదులో వసతి కల్పించినట్టు చెప్పారు. మలక్‌పేట్ సర్కిల్‌లోని మూసా నగర్ కమ్యూనిటీ హాల్ లో 150 మంది, దుర్గానగర్, అంబేద్కర్ నగర్ కు చెందిన 45 కుటుంబాలు మూసారాంబాగ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి పొందుతున్నారన్నారు. గోల్నాక కమేలా సమీపంలోని కృష్ణ నగర్ నివాసితులైన 32 మందిని కృష్ణ నగర్ కమ్యూనిటీ హాల్‌కు తరలించినట్టు చెప్పారు. భూ లక్ష్మీ ఆలయం నుంచి 55 మందిని సురక్షిత ప్రదేశమైన గోడే-కి-ఖబర్ జిహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌కు తరలించామని, ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారనీ మంత్రి వెల్లడించారు. రాత్రి ఒక్కసారిగా చాదర్ఘాట్ బ్రిడ్జి పై నుంచి వరద పెరగడం, ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లో వరద ప్రవాహం పెరగడంతో ముఖ్యమంత్రి ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ,పోలీస్, హైడ్రా, ట్రాఫిక్,వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ అన్ని రకాల చర్యలు తీసుకున్నామని వివరించారు. బతుకమ్మ ,దసరా పండుగలకు వెళ్లే ప్రయాణికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి గమ్య స్థానాలకు చేరుస్తున్నట్టు చెప్పారు.

అమెరికా సుంకాలతో భారత వృద్ధికి ముప్పే

క్రిసిల్

న్యూఢిల్లీ : భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా భారీ సుంకాలను విధిస్తుండటం వల్ల భారత ఎగుమతులతో పాటు పెట్టుబడులపైనా తీవ్ర ప్రభావం పడుతుందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. అయితే, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, జీఎస్టీ రేట్ల కోతతో దేశీయ వినియోగం పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ జీడీపీ ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతానికి పెరిగిందని, గత ఏడాది ఇదే త్రైమాసికంలో 7.4 శాతంగా ఉన్నట్లు క్రిసిల్ వెల్లడించింది. అయితే ఇదే వ్యవధిలో నామమాత్రపు జీడీపీ మాత్రం 10.8 శాతం నుంచి 8.8 శాతానికి మందగించిందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో 4.6 శాతంగా ఉన్న వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.5 శాతానికి తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేసింది. అధిక వర్షాల ప్రభావాన్ని ఇంకా అంచనా వేయనప్పటికీ... ఆరోగ్యకరమైన వ్యవసాయ వృద్ధి ఆహారపు ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుం దని ఆశాభావం వ్యక్తం చేసింది. తక్కువ చమురు ధరలు, అంతర్జాతీయ నిత్యవసరాల ధరలు ఆహారేతర ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే అవకా శం ఉందని క్రిసిల్ పేర్కొం ది. ఇక ద్రవ్యపరపతి విధానం విషయానికొస్తే... ఈ ఆర్థిక సంవత్స రం భారతీయ రిజర్వు బ్యాంకు మరోసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని అంచనా వేసింది.

ముంచేసిన మూసి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న వివిధ బ్రిడ్జిలపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ బ్రిడ్జిలపై రాకపోకలు నిలిపివేశారు. ముసారాంబాగ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి సెంట్రింగ్ కొట్టుకుపోయింది. వివిధ ప్రాంతాల్లో నదుల్లా మారిన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. నగరంలోని బార్కాస్‌లో అత్యధికంగా 61 మి.మీ. వర్షపాతం నమోదైంది. హిమాయత్‌సాగర్ నీటి నిల్వసామర్థ్యం 1,763.50 అడుగులు కాగా... ప్రస్తుతం 1,762.85 అడుగుల మేర నీరు ఉంది. జలాశయంలోకి 23 వేల క్యూసెక్కుల నీరువస్తుండగా... దిగువకు 21,450 క్యూసెక్కులు వదిలారు. ఉస్మాన్‌సాగర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 1,790 అడుగులు కాగా... 1,789.15 అడుగులకు నీరు చేరింది. ఇన్‌ఫ్లో 14 వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 13,335 క్యూసెక్కులుగా ఉంది. రెండు జలాశయాల నుంచి సుమారు 35 వేల

క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడం గత పదేళ్లలో ఇదే ప్రథమం. వరద ఉధృతికి నది పక్కనున్న వివిధ బస్తీలు నీట మునిగాయి. ముసారాంబాగ్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. దీంతో అంబర్‌పేట, గోల్నాక, మలక్‌పేట, కోఠి, బేగంపేట, అఫ్జల్‌గంజ్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నదిపై ఇక్కడ నూతనంగా నిర్మిస్తున్న వంతెన సెంట్రింగ్ వరద నీటిలో కొట్టుకుపోయింది. వరద ప్రవాహం పెరగడంతో చాదర్‌ఘాట్ బ్రిడ్జిపైనా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఐటీ కారిడార్‌తోపాటు అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లకిడీకాపూల్, కోఠి, మలక్‌పేట, చాదర్‌ఘాట్, మెహిదీపట్నం, టోలీచౌకీ, జూబ్లీహిల్స్, బంజరాహిల్స్, మాసబ్‌ట్యాంకు, నాంపల్లి, ఎంజెమార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. నార్సింగ్-మంచిరేవుల మధ్య ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వరద నీటిలో చిక్కుకున్న నలుగురిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తడంతో ఆ ప్రాంతాన్ని వరద నీరు ముంచెత్తింది. ఆటో ట్రాలీలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా.. వరద నీటిలో చిక్కుకున్నారు. రాత్రి వేళ నదిలో వరద ప్రవాహం పెరగడంతో ఒక్కసారిగా మూసీ వెంట ఉన్న బస్తీలు చాలా వరకు నీట మునిగాయి. ఇళ్లలోకి నీరు చేరింది. చాదర్‌ఘాట్ రసూల్‌పురాలోని ఓ ఇంట్లో ఎనిమిది మంది వరద నీటిలో చిక్కుకున్నారు. హైడ్రా డీఆర్ఎఫ్ బృందం బోటులో వెళ్లి వారిని రక్షించే ప్రయత్నం చేసింది. నది వెంట ఉన్న శంకర్‌నగర్, మూసానగర్, దుర్గానగర్, అంబేద్కర్ నగర్, కృష్ణానగర్, భూలక్ష్మి దేవాలయం, బండ్లగూడ జాగీర్‌లోని సాయిరాంనగర్, పీఅండ్‌టీ కాలనీలో వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

జీహెచ్‌ఎంసీ అప్రమత్తం

నది ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలతో జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రాంతాల్లోని ముంపు బాధితులు సుమారు 1,500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, తాగునీరు ఏర్పాట్లు చేయడంతోపాటు దుప్పట్లు అందజేశారు. వైద్య సదుపాయం అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించిన కర్ణన్ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. హుస్సేన్‌సాగర్‌లోనూ నీటి మట్టం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం దాటింది. దీంతో సర్‌ప్లస్ నాలా తీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

ఎంజీబీఎస్‌ను పరిశీలించిన రంగనాథ్

మూసీ పరివాహక ప్రాంతాలన్నీ జలమయమయం కావడంతో రెవెన్యూ, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు చేపడుతున్నాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఎంజీబీఎస్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అక్కడి అధికారులకు సూచనలు చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి వరద నీరు చేరడంతో ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ప్రయాణికులకు సూచనలిచ్చారు. 'పొరపాటున ఎంజీబీఎస్‌కు ఎవరైనా ప్రయాణికులు వచ్చినా వారిని తరలించేందుకు అవసరమైనన్నీ లోకల్ బస్సులు అందుబాటులో ఉంచాం. వారిని ఆయా బోర్డింగ్ ప్రాంతాలకు లోకల్ బస్సుల్లో తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం. వర్షాలు, వరద తగ్గుముఖం పట్టేవరకు ఎంజీబీఎస్‌కు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి' అని తెలిపారు. ఎంబీజీఎస్ నుంచి బయలుదేరే బస్సులను వివిధ ప్రాంతాల నుంచి సంస్థ నడుపుతోంది. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపునకు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి, వరంగల్, హనుమకొండ వైపునకు వెళ్లేవి ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి, సూర్యాపేట, నల్గొండ, విజయవాడ వైపునకు ఎల్బీనగర్ నుంచి , మహబూబ్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపునకు వెళ్లే సర్వీసులు ఆరాంఘర్ నుంచి వెళ్తున్నాయి.

తెలంగాణ సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం అజరామరం

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడిన మహనీయుడు, ప్రజాసేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ పౌరుషానికి మారుపేరు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మంత్రి పేర్కొన్నారు. స్వతంత్ర సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ సాధన కోసం ఆయన ఎప్పుడూ ముందుండి పోరాడారని, సమైక్య రాష్ట్రంలో అన్యాయం తట్టుకోలేక తన మంత్రి పదవికి తృణప్రాయంగా రాజీనామా చేశారని గుర్తు చేశారు. బాపూజీని ఆదర్శంగా తీసుకొని తాను కూడా తెలంగాణ కోసం పదవికి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇప్పటికే స్థాపించామని, ఇకపై నల్గొండలో ఆయన పేరుతో ఆడిటోరియం నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. జనాభా ప్రతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా ప్రత్యేక జీవో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. ఈ అంశంపై పలుమార్లు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. చదువుకున్న నిరుద్యోగులకు ప్రభుత్వ రంగంలో మాత్రమే కాకుండా, ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్చార్జి డీఆర్ఓ అశోక్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, బీసీ సంఘ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర -వనపర్తి లో : స్వాతంత్ర సమరయోధుడు, తొలి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక భూమిక పోసించాడని వనపర్తి

జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ యంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లుర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అణగారిన వర్గాల హకుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషి చేసిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని, స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని, దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ కోసం ఉద్యమించి, ఉద్యమకారులతో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష, ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారని వారి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ డిఎస్పీ, ఉమా మహేశ్వర్‌రావు కార్యాలయం ఏఓ, సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్‌లో: కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ, జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్

మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొని కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ఆయన చేసిన సేవలు తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి మరియన్న, జిల్లా అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంఘం నాయకులు, వి.వెంకన్న, సిహెచ్ వెంకటేశ్వర్లు, పి.రమేష్, పి.అశోక్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హుస్నాబాద్‌లో: కొండ లక్ష్మన్ బాపూజీ నిస్వార్ధపరుడని సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ ఆఫీసులో కొండ లక్ష్మన్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

తెలంగాణ స్వరాష్ట్రం కోసం కొట్లాడిన తెలంగాణ స్వరాష్ట్రం కోసం కొట్లాడిన దీశాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, మాజీ కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, సత్యనారాయణ, చిత్తారి రవీందర్, వడ్డెపల్లి రమణ, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో: కొండా లక్ష్మణ్ బాపూజీని స్ఫూర్తిగా తీసుకొని, వారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించిన 110వ జయంతి వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "కొండా లక్ష్మణ్ బాపూజీ మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని

న్యాయవాదిగా, ప్రజా ప్రతినిధిగా, మంత్రిగా ప్రజల హక్కుల కోసం కష్టమైన పరిస్థితుల్లో కూడా అహర్నిశలు పోరాడారు. ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమైనవి" అని కొనియాడారు. మహనీయుల ఆశయాలను మనమంతా కలసి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహారావు, మాజీ మున్సిపల్ కమిషన్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు చల్లమల్ల నరసింహా, రామ ప్రభు, శారదా దేవి, అప్పం శ్రీనివాస్, పెండెం కృష్ణ, బంటు కృష్ణ, బయ్య మల్లికార్జున యాదవ్, వెంకటేశ్వర్లు, నగేష్, సైదులు, తల్లమల హుస్సేన్, యుగంధర్, లక్ష్మణ్, లింగయ్య, టీఎన్జీవో సెక్రటరీ దున్న శ్యామ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో: రాష్ట్రంలోని అంగన్వాడి, ఆశా వర్కర్ల సమస్యలను విడతల వారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానని, బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో గొప్పదని రాష్ట్ర పంచాయతిరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్ జి గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి మంత్రి ఏకరూప దుస్తులను (యూనిఫామ్) పంపిణీ చేశారు. అంతకు ముందు గిరిజన భవన్ లో ములుగు, మల్లంపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భాల్లో మంత్రి మాట్లాడుతూ అంగన్వాడి పాఠశాలలను మూసివేసే అవకాశం ఉందని ప్రచారంలో నిజం లేదని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అదనంగా పాఠశాలలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నారని వివరించారు. నూతన పాఠశాలలను ఏర్పాటు చేయడమే కాకుండా కారుణ్య నియామకాలు చేపట్టడానికి సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారని, అంగన్వాడి సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది బాధ్యతాయుతంగా విధులను నిర్వహిస్తూ పిల్లలకు మంచి పౌష్టికాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి సిబ్బంది తమ స్వంత పిల్లలు లాగానే చూసుకోవాలని, ఏకరూప దుస్తులు అందని సిబ్బందికి త్వరలో అందజేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సహకారంతో మహిళాసంఘాల సభ్యులు విజయవంతంగా పలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. సోలార్ ప్లాంట్లు, ఆటోలు, వాహనాలు, బస్సుల కొనుగోలు కోసం బడ్డీలేని రుణాలను అందజేస్తున్నామని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారని తెలిపారు. ప్రతి మహిళా సంఘంలో చేరి ప్రభుత్వం అందించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ములుగు నియోజకవర్గంలో రేషన్ ఇప్పటికే అర్హులను గుర్తించి పదివేలకు పైగా రేషన్ కార్డులను పంపిణీ చేశామని, నూతన కార్డులను పంపిణీ చేయడమే కాకుండా వారికి సన్న బియ్యం అందిస్తున్నామని, రాష్ట్రంలోని పేదలందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు అందజేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రభుత్వానికి అండగా నిలవాలని సీతక్క కోరారు. అనంతరం డిఎల్ఆర్ గార్డెన్‌లో మహిళలు, గెజిటెడ్ సంఘం ఏర్పాటు చేసిన బతుకమ్మలతో మహిళలతో కలసి మంత్రి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యూఓ తుల రవి, డి సి ఎస్ ఓ షా ఫైజల్ హుస్సేనీ, ప్రజా ప్రతినిధులు, సిడిపిఓలు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, రేషన్ కార్డు లబ్ధిదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో బతుకమ్మ సందడి

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం హాస్పటల్ సూపరిటెండెంట్ వీరన్న ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ వాతావరణం సందడి చేసింది. మహబూబాబాద్ డిసిహెచ్ఎస్ చింత. రమేష్, ఏ ఎన్ ఎమ్స్, స్టాఫ్ నర్స్, ఆసుపత్రి సిబ్బంది ఈ బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. హాస్పటల్ సూపరిటెండెంట్ వీరన్న బతుకమ్మ పండుగ చరిత్రను గుర్తు చేసుకున్నారు. ఆడబిడ్డలకు ప్రతీకగా ఈ బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర మంతట గొప్పగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. పూలపండుగ ప్రతి వీధి ప్రతి గడప గ్రామ గ్రామాన పూల పండుగ వాతావరణంలో ఆడపడుచులంతా ఒకచోట చేరి బతుకమ్మలు పేర్చి పాటలు పాడుతూ కోలాటాలు వేస్తూ వచ్చింది వచ్చింది పండుగ సందడి అంటూ కేరింతలతో పల్లె వాతావరణం మారుమోగుతుందని అన్నారు. ప్రత్యేకంగా బతుకమ్మలను పేర్చిన వారికి శాలువాతో సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు.

లొంగిపోయి సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులకు రివార్డు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: లొంగిపోయిన ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు పార్టీ సభ్యులకు రివార్డులను శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ శబరిష్ పి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత మే నెలల్లో నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకిచెందిన ముగ్గురు సభ్యులు ములుగు జిల్లా ఎస్.పి. డా. శబరీష్.పి, ఎదుట లొంగిపోయారని, ఈ విధంగా లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టు సభ్యులకి తెలంగాణ సరెండర్ పాలసీలో భాగంగా తక్షణ సహాయంగా, ప్రభుత్వం నుండి ప్రతి ఒక్కరికీ రూ.25,000 చొప్పున వారి నగదు రివార్డును అందచేశామని తెలిపారు. వారి వారి క్యాడర్ ఆదారంగా మడవి మంగ్లీ ఏ మాసే ఏసీమ్‌కి రూ.3,75,000, పార్టీ సభ్యుడైన మడకం కమలేష్, మడకం భీమే లకి ఒక్కొక్కరికి రూ.75,000 చెక్ రూపంలో శనివారం అందచేయటం జరిగిందన్నారు. లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులు వివిధ క్యాడర్, వివిధ గ్రామాలకు, బీజపూర్ జిల్లా, ఛత్తీస్‌గఢ్ రాష్టంకు చెందిన వారు అని అన్నారు. అనంతరం అయన మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు డిడీ, వైద్య చికిత్స, పునరావాస సహాయం అందుతోందని, వారు సమాజంలో తిరిగి స్థిరపడేందుకు అన్ని విధాల మద్దతు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలవమంటూ విజ్ఞప్తి చేస్తూ వివిధ పద్ధతుల్లో, మాధ్యమాల ద్వారా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు సమాచారం అందించడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు, ములుగు పోలీస్ విజ్ఞప్తి అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు బయటకు వచ్చి, జీవన స్రవంతిలో కలవడానికి ముందుకు వస్తే, సరెండర్ పాలసీలో భాగంగా తక్షణమే వారికి పునరావాసాన్ని ములుగు పోలీస్ వారు కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డి.ఎస్.పి (ఇన్చార్జి ఓ ఎస్ డి) రవీందర్, ఆర్ ఐ తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు తెలంగాణ ఉద్యమ కారుడు మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నేరేడుచర్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి పుల్లారావు ఆధ్వర్యంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం సర్వస్వం అర్పించిన త్యాగధనుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు బొడ్డుపల్లి సుందరయ్య, చిలకరాజు శ్రీను, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెరుకుపల్లి నరసింహ, సంఘం నాయకులు రెబ్బ రమేష్, చిలివేరు శేఖర్, చిట్టిప్రోలు ఉపేందర్, నక్క శ్రీను, ఏలే శివ, యరమద సైదులు, కొండా రామకృష్ణ, నామ రవి, కనకయ్య, బత్తినీ శ్రీనివాస్, రావిరాల సత్యం, గంజి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర - తొర్రూరు: తొర్రూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో నితిన్ ఫౌండేషన్‌లో శనివారం వంద మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌పై పుస్తకాల పంపిణీ చేశారు. ముదుపు రవీందర్ రెడ్డి కుమారుడు, కుమార్తె బాబు రెడ్డి, మహాలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా బియ్యం నిత్యావసర సరుకులను ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కుందూరు రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులను గుర్తించి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో కూల్ గ్యాట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్‌సి దామెర సరేష్, క్లబ్ సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, లయన్ నగేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా వినూత్న ప్రచారం

విశాలాంధ్ర - కోదాడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ రాష్ట్ర వ్యాప్తంగా వినూత్న ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జనచైతన్య బైక్ యాత్ర 1000 కిలోమీటర్లు పర్యటించి శనివారం కోదాడకు చేరుకుంది. ఈ సందర్భంగా కోదాడ ప్రాంతంలోని రద్దీగా ఉండే పలు కూడళ్లలో ద్విచక్ర వాహనంపై మైక్ పెట్టుకుని ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టి ఉన్నత విద్యలు అభ్యసించి తమపై తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే తాను సమాజాన్ని చైతన్య పరచడానికి తన వంతుగా సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా సెలవు దినాల్లో యువత సక్రమ మార్గంలో నడిచేందుకు మెరుగైన సమాజం నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

అత్యాధునిక సాంకేతికతతో ఏటిసి సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: శనివారం రామగుండంలో 50 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ను ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది రామగుండంలో అభివృద్ధి దిశగా మరో అడుగుగా ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిలవనుందన్నారు. ప్రత్యేకంగా ఐటీ, స్కిల్ డెవలప్మెంట్, రోబోటిక్స్ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ త్యాగధనులు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణా ఉద్యమ కారులలే కాక అంతకు ముందు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న త్యాగాధనులని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అయనను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జీవితాలను సార్థకం చేసుకోవాలని కోరారు. శనివారం కలెక్టరేట్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1969 ఏడాది తొలి దశ తెలంగాణ పోరాటంలో బాపూజీ కీలకపాత్ర పోషించారని తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉద్యమానికి అండగా నిలిచిన మహనీయులన్నారు.ఆయన తనకంటూ ఏమి సంపాదించక పోగా బలహీనవర్గాల అభివృద్ధికి తన ఆస్తులు దానం చేసిన త్యాగశీలి అన్నారు. బీసీ సంక్షేమ అధికారి పి. విజయలక్ష్మి, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి ఏ.శ్రీలత, డీఎస్ఓ రుక్మిణి, బి.సి. సంఘ నాయకులు ఇమంది ఉదయ్ కుమార్, కొదుమూరి సత్యనారాయణ, గుమలాపురం సత్యనారయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొమరం భీం : దేశం కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పద్మశాలి సేవా సంఘం, బి.సి. సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆసిఫాబాద్ జిల్లా వాసి కావడం గర్వకారణమని, తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాలలో పాల్గొని రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారని, నమ్మిన సిద్ధాం తానికి కట్టుబడి స్వశక్తితో ఎదిగిన మహోన్నత వ్యక్తి అని అన్నారు.

ముస్లింలకు ఉచిత ఆన్‌లైన్ సేవలు

విశాలాంధ్ర-కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ఇటివలే ముస్లిం మైనార్టీలకు ప్రకటించిన నూతన స్కిమ్స్ అయిన 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన రేవంత్ అన్న కా సహారా' అనే పథకాలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జరిచేసిందని అహలే సున్నత్ జమాత్ చైర్మన్ ఎం.ఎ. రజాక్ అన్నారు. ఈ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసేందుకు అక్టోబర్ 6 వరకు అవకాశం కల్పించిందన్నారు. శనివారం పట్టణంలోని ఏయస్జే జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ కరీం ఖాద్రీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న రజాక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు కోసం ప్రకటించిన ఈ రెండు పథకాలకు తాము ఉచిత ఆన్లైన్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉచిత ఆన్లైన్ దరఖాస్తు కోసం సంస్థ భాధ్యులు సెల్ 8886934260 నెంబర్ కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్ మోహినుద్దీన్, షేక్ యఖుబ్ ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హుస్సేన్ ఖాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ షమీ, అధికార ప్రతినిధి అడ్వకేట్ మహమ్మద్ సాదిక్ పాషా, జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ షఫీ, షేక్ నయీమ్ ఛిస్తీ, మదీన అక్తర్ పాషా పాల్గొన్నారు.

మంజీరా ఉగ్ర రూపం

ఏడుపాయల్లో కొట్టుకుపోయిన లడ్డు కౌంటర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మెదక్ జిల్లాలో మంజీరా నది ఉగ్ర రూపం దాల్చింది. అటు వరద, మరో వైపు భారీ వర్షాల కారణంగా పలు చోట్ల రాకపోకలు నిలిచి పోయాయి. ఏడుపాయల అమ్మవారి ఆలయం పూర్తిగా మునిగింది. ఎగువ సింగూరు ప్రాజెక్ట్ 10 గేట్లు తెరవడంతో లక్ష 24 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుంది. దీంతో ఎల్లాపూర్ బ్రిడ్జి పైనుండి మంజీరా ప్రవహించడంతో మెదక్- పాపన్నపేట రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరో వైపు ఏడుపాయల వెళ్లే బ్రిడ్జి పై నుండి నీళ్లు పారడంతో ప్రయాణీకులు వెళ్లనివ్వకుండా పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. గుండు వాగు పారుతున్నందున టేక్మాల్ మండలంలో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఏడుపాయల్లో లడ్డు ప్రసాదాల్ కౌంటర్ వర్దలో కొట్టుకుపోయింది. వచ్చే 3 రోజులు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన చేసిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విధుల్లో నిమగ్నమై ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రకృతి వైద్యుడు సుగుణారావుకి కప్పింగ్ థెరపీ సర్టిఫికెట్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం జిల్లాలో ప్రముఖ ప్రకృతి వైద్యులుగా పేరున్న హెచ్ ఆర్ జి. సుగుణ రావు ఆక్యుపంచర్పిస్, ఆక్యుప్రెషర్ సైన్స్, ఖైరో ప్రాక్టీస్ (మర్మకల), డ్రగ్లెస్ థెరపీలో హీలర్‌గా అంచలంచలుగా ఎదుగుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ క్రమంలో కప్పింగ్ థెరపీ (హిజామా) లో డిప్లమా కోర్సు పూర్తి చేసి, మరో సర్టిఫికెట్‌ని అందుకున్నారు. ఇటీవలే విజయవాడలోని నేచురల్ హీలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కప్పింగ్ తెరిపి డిప్లమా కోర్స్ పూర్తిచేసారు. ఆ సంస్థ నిర్వాహకులు, ప్రముఖ ట్రైనర్, డాక్టర్ ఎస్.చెన్న అప్పారావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నట్లు హీలర్ సుగుణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా అద్భుతమైన కప్పింగ్ (హిజమా) పద్ధతుల ద్వారా సున్నత్, డ్రై, ఫైర్, అక్యుపంక్చర్, వాటర్, ఐస్, మాగ్నెట్, మోక్సా, హెర్బల్, మసాజ్ , ఫేషియల్, ఆయిల్ కప్పింగ్ పద్ధతులలో అనేక రకాల మొండి వ్యాధులను తగ్గించేందుకు వైద్య సేవలను అందిస్తానని తెలిపారు. కాగా ఈ కోర్సు పొందిన సుగుణరావును కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రముఖ కవి జయరాజు, సభ్యులు డా.బి. కృష్ణయ్య, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, మహమ్మద్ ముస్తఫా, సింగరేణి అవిశ్రాంత జిఎం శనగ వెంకటేశ్వర్లు, ఏజీఎం గోనే శ్రీకాంత్, కె హెచ్ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు తుమ్మలపల్లి ప్రసాద్, జర్నలిస్ట్ పూర్ణ, ప్రముఖ సింగర్ వెంకట ముత్యంలతో పాటు, తోటి హీలర్స్ స్వప్న, మంగ, రవికుమార్ అభినందించారు.

మహిళా సమాఖ్య బతుకమ్మ ఆటా పాట

విశాలాంధ్ర - కొత్తగూడెం : భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్ ఆవరణలో బతుకమ్మ సంబురాలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా, జీవనాడిగా ప్రతీ ఏటా జరుపుకునే బతుకమ్మను వైభవంగా చేపట్టారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పూలను పేర్చి బతుకమ్మను తయారు చేసి అరుణ పతాకం ఎగురుతుండగా నృత్యాలు చేశారు. చిన్నారులు చేసిన కోలాట నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా సిపిఐ జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ఎస్ కె. సాబీర్ పాషా, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ వేడుక అద్దం పడుతుందన్నారు. మహిళలంతా ఒక వేదిక వద్దకు చేరుకుని పండుగ వాతావరణంలో ఐక్యతను చాటడం అభినందనీయం అన్నారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ వేడుక వాతావరణంలో ఆరోగ్య కరమైన పలు మార్పులను తీసుకొస్తుందని చెప్పారు. బతుకమ్మ సంబురాల సాక్షిగా సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అన్యాయాలు అక్రమాలపై భారతజాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి తోటి మహిళలకు అండగా నిలవాలని వారు సూచించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, జి వీరస్వామి, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, రత్నకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడక్కడా రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకి రావద్దని ఆయన అభ్యర్థించారు. యువత సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహి స్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. జాలర్లు, ప్రజలు చేపల వేటకు వెళ్ళకూడదన్నారు. పశువుల కాపర్లు, రైతులు నదులు, వాగులు, వంకల పరిసర ప్రాంతాల దగ్గరకు వెళ్లకూడదని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇప్పటికే ప్రమాదకరంగా మారుతున్న రహదారులు, జాగ్రత్త జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరపున 24 గంటలు అందుబాటులో ఉండేలా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితుల్లో ఉన్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. కలెక్టర్ సతీమణి శ్రీజ, కుటుంబ సభ్యులు, అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇతర జిల్లా మహిళా అధికారులు మాధవి, నీలిమ, హేమభార్గవి, విజయలక్ష్మి, ఇతర అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చి, గౌరీ మాత పాటలపై మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆడారు. చక్కగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతులు అందజేశారు.

సంపాదకీయం

బీహార్‌లో చిల్లర పంపిణీ

ఎన్నికలే లేకపోతే సామాన్యుల బతుకు ఏమయ్యేదో! రాజకీయ పార్టీలకు ఎన్నికలు పరీక్షలా ఉంటే ఉండొచ్చు తప్ప సామాన్య ప్రజలకు మాత్రం పండగే. ఎన్నికలు లేకపోతే ప్రధానమంత్రి మోదీ విరివిగా అబద్ధాలు చెప్పేవారు కాదేమో! మొదటి రకం అబద్ధాలు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోవడం. అదేమంటే అవి ఎన్నికల వాగ్దానాలని ఆ మాత్రం తెలియదా అని దబాయించగలరు. రెండో రకం అబద్ధాలు ప్రజలకు తాయిలాలు ఇవ్వకూడదని ఇతర పార్టీలకు సుద్దులు చెప్పి తానే అత్యంత ఉదారంగా ఎన్నికల సమయంలో చేతికి ఎముకే లేనట్టు వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడం. తాయిలాలను మోదీ రేవడీలు అంటారు. అవి ఎంత ప్రమాదకరమో ఆయన గంభీరంగా చెప్తుంటారు. కానీ ఎన్నికలు ముంచుకొచ్చినప్పుడు ఏ పార్టీ ఇవ్వలేని రేవడీలు ఆయనే ఇచ్చేస్తుంటారు. బీహార్‌లో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కార్యక్రమం ప్రకటించిన తరవాత కొత్త పథకాలు ప్రారంభించడం కుదరదు. ప్రభుత్వం నుంచి జనానికి ఎలాంటి ఆర్థిక సహాయమూ అందించడానికి వీలులేదు. వచ్చే నెల మొదటి వారంలో బీహార్ శాసనసభ ఎన్నికల ఉత్తర్వు జారీ కావచ్చు. ఆ తరవాత రేవడీల పంపిణీకి అడ్డుకట్ట పడ్తుంది. అయితే ఓట్లు కొనడానికి డబ్బు వెదజల్లడం అప్పుడూ గుట్టు చప్పుడుకాకుండా కొనసాగుతుంది. ఈ గొడవంతా ఎందుకని ప్రధానమంత్రి మోదీ బీహార్‌లో 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలలోకి పదేసి వేల చొప్పున బదిలీ చేయించేశారు. నిజానికి ఈ పథకం పేరు ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకం. కానీ బీహార్ ముఖ్యమంత్రి నిమిత్త మాత్రుడే కనక ఆ 75 లక్షల మందికి 7,500 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే కార్యక్రమం ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా జరగనిచ్చేశారు. ఈ పథకం కింద అర్హులైన మహిళలందరికీ డబ్బు అందలేదు. మిగతా వారికి అక్టోబర్ మూడో తేదీన అందజేస్తారట. అంటే ఎన్నికల నిర్వహణకు అధికారిక ఉత్తర్వు రాకముందే మహిళల చేతుల్లో నాలుగు కాసులు ఆడతాయన్న మాట. ఈ పదివేల రూపాయలతో మహిళలు ఏ ఉపాధి సంపాదించుకోగలుగుతారు అని అడగడం చొప్పదంటు ప్రశ్నలడగడం కిందే లెక్క. ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకుని పురోగతి కనబరచిన వారికి అవసరాన్నిబట్టి మరో రెండు లక్షల దాకా అందజేస్తారట. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు సాధికారికత కల్పించడం ఈ పథకం లక్ష్యమట. మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో నారీ శక్తి అన్న మాట గుర్తుండే ఉంటుంది కదా! ఈ ప్రభుత్వం ఉత్పాదకతను పెంచడానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా లేదు. కావాలంటే ఎన్నికల ముందు ఇలాంటి చిట్కాలు ఎన్ని అయినా ప్రయోగించి ఈ విషయంలో తమకు సాటి ఎవరూ లేరని నిరూపించుకోగలదు మోదీ ప్రభుత్వం. దాదాపు 20 ఏళ్ల నుంచి నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన అనేక పిల్లిమొగ్గలు వేశారు. ఆయన ఎటూ వేపు మొగ్గ వేసినా చివరకు ముఖ్యమంత్రి కుర్చీలోనే పడడంలో నిష్ణాతుడు. అధికారం కోసం ఆయన దేన్ని అయినా త్యాగం చేయగలరు. అనువు కానప్పుడు ఎవరినైనా ఎన్ని మాటలైనా అనగలరు. కానీ అవసరం వచ్చినప్పుడు తాను ఇంతకు ముందు దూషించిన వారిని నోరార పొగడగలరు. లేదా తనను ఇంతకు ముందు తూర్పారపట్టిన వారి సరసన ఇట్టే ఒదిగిపోగలరు. ముఖ్యమంత్రి పదవి ముందు ఆయన నమ్మిన సోషలిస్టు సిద్ధాంతాల లాంటివి ఏ మాత్రం అడ్డు రావు.

ఎన్నికలకు సిద్ధం కావడం కోసం నితీశ్ కుమార్ నాయకత్వంలోని ప్రభుత్వం కూడా యథాశక్తి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించనుంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో 26 అభివృద్ధి కార్యక్రమాలకు గత సెప్టెంబర్ తొమ్మిదిన మంత్రివర్గ ఆమోద ముద్రపడింది. యువతకు ఉద్యోగాలు, పట్నాలో జీవికా భవన్, 8053 పంచాయతీల్లో కళ్యాణ మంటపాలు, అంగన్ వాడీ కార్యకర్తలకు చెల్లించే మొత్తం పెంచడం లాంటి అనేక కార్యక్రమాలకు మంత్రివర్గ ఆమోదముద్ర పడి పోయింది. ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి సౌర విద్యుద్దీపాల పథకం కోసం బీహార్ ప్రభుత్వం వంద కోట్ల రూపాయలు ఖర్చు పెడ్తుందట. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ముద్ర యోజన, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, మేక్‌ఇన్ ఇండియా లాంటి ఎన్నో ఆకర్షణీయ పథకాలు చేపట్టారు. మధ్య తరహా చిన్న తరహా పరిశ్రమలకు చేయూత ఇస్తామన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం వెతుక్కునే పరిస్థితి పోయి వారే పది మందికి ఉపాధి కల్పించే స్థితికి రావాలని మోదీ అదే పనిగా చెప్తూ ఉండేవారు. కానీ అంతో ఇంతో ఉపాధికోసం ఉపకరించే మహాత్మా గాంధీ గ్రామీణ రోజ్‌గార్ యోజనకు నిధుల కేటాయింపులో మాత్రం కోత పెడ్తుంటారు. ఆ పథకం అమలు కోసం ఏ మాత్రం శ్రద్ధ చూపరు. బీహార్ శాసనసభ ఎన్నికలకు ముందు నితీశ్ కుమార్ చేస్తున్న హడావుడి కన్నా ప్రధానమంత్రి మోదీ హడావుడే ఎక్కువగా ఉంది. ఏప్రిల్ 22న పహల్గాంలో తీవ్రవాదుల కిరాతక దాడి జరిగినప్పుడు మోదీ విదేశీ పర్యటనలో ఉన్నారు. కానీ ఈ వార్త విని సౌదీ అరేబియా నుంచి హుటాహుటిన తిరిగి వచ్చేశారు. ఈ దురాగత బాధితులను పరామర్శించడానికి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండడానికి మోదీ ఏమేం చర్యలు తీసుకున్నారో తెలియదు. కానీ మర్నాడే బీహార్ పర్యటనకు వెళ్లి పోయారు అంటే బీహార్‌లో మోదీ ఎన్నికల కోడి కనీసం నాలుగు నెలల ముందే కూసింది. ఎన్నికలు జరిగే లోగా ఆయన ఎన్ని సార్లు బీహార్ చుట్టివస్తారో తెలియదు. ఈ సారి మోదీ నాయకత్వంలోని బీజేపీ లక్ష్యం నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యు) మీద ఆధారపడకుండా బీహార్‌లో అధికారం సంపాదించడం. దీనికోసం నితీశ్ పార్టీని వీలైనంత బలహీన పరచడానికి మోదీ ఎంతకైనా తెగించగలరు. గత ఎన్నికల్లో ఇలాంటి ఎత్తులు వేసినందువల్లే నితీశ్ కుమార్‌కు చాలా తక్కువ స్థానాలు వచ్చాయి. ఇది వరకు బీహార్ ఎన్నికలకు ముంది మీ రాష్ట్రానికి ఎంత కేటాయించ మంటారు? 50 కోట్లా వంద కోట్లా...అని వేలం పాట పాడినట్టు చివరకు కోట్లాది రూపాయలు కేటాయించినా బీజేపీకి కలిగిన మేలేమీ లేదు. ఈసారీ మళ్లీ వేలాది కోట్లు ఎన్నికల ముందు గుమ్మరి స్తున్నారు. ఈసారి ఎలాగైనా బీహార్‌లో అధికారం సంపాదించడానికే ఆ రాష్ట్రంలో ప్రత్యేక నిశిత ఓటర్ల జాబితా సవరణ చేపట్టారు. ముస్లింల, ప్రతిపక్షాల ఓట్లను జాబితా నుంచి తొలగించడానికి ఎన్నికల కమిషన్ చేత చేయగూడని పనులన్నీ చేయించారు. దాని వల్ల బీజేపీ ఎత్తుగడలు కుట్రలని తేలిపోయింది. అదీ చాలక ఇప్పుడు మహిళలకు చిల్లర పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే ఈ ఎత్తుగడా బెడిసికొడ్తుందని అనిపిస్తోంది.

పెన్షనర్ల వెతలు తీరేదెన్నడు?

టీఎంబీ బుచ్చిరాజు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పరిస్థితి అత్యంత బాధాకరంగా మారింది. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితి వలన ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులు, పెన్షనర్ల కోసం అనేక హామీలు గుప్పించారు. కరువుభత్యం (డీఏ)/డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) బకాయిలు విడుదల చేస్తామని, పీఆర్‌సీ సకాలంలో అమలు చేస్తామని, పీఆర్‌సీ కమిషనర్ నియమిస్తామని, కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పింఛన్ పద్ధతి (ఓపీఎస్) అమలు చేస్తామని ఎన్డీయే కూటమి స్పష్టంగా చెప్పింది. అయితే ఇవన్నీ ఇప్పటికీ అమలు కాలేదు. దీని వలన ఉద్యోగులు-పెన్షనర్లలో తీవ్ర ఆవేదన నెలకొంది.

నెరవేరని వాగ్దానాలు

1. డీఏ/డీఆర్ బకాయిలు - కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెంపులు రాష్ట్రంలో అమలు కాకపోవడం వలన వందల కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయి. దీని వలన వృద్ధాప్యంలో



పెన్షనర్లు, కుటుంబ అవసరాలు ఉన్న ఉద్యోగులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు.

2. పీఆర్‌సీ బకాయిలు, వేతన సవరణలో ఆలస్యం, బకాయిలు చెల్లించకపోవడం వల్ల గణనీయమైన నష్టం వాటిల్లింది. పీఆర్‌సీ తక్షణం అందకపోవడంతో నెలవారీ ఆదాయంపై తీవ్రమైన ప్రభావం పడింది.

3. పీఆర్‌సీ కమిషనర్ నియామకం జరగలేదు-కొత్త వేతన సవరణ ప్రక్రియ ప్రారంభం కాకపోవడం వలన ఉద్యోగుల భవిష్యత్ వేతనాలపై అనిశ్చితి ఏర్పడింది.

4. ఓపీఎస్ అమలు కాలేదు - సీపీఎస్‌లో పనిచేస్తున్న వేలాది మంది యువ ఉద్యోగులు ఓపీఎస్ కోసం ఎన్నోసార్లు ఆందోళనలు చేశారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోవడంతో వారి భవిష్యత్తు చీకట్లోకి దిగజారిపోతోంది.

ఉద్యోగులు - పెన్షనర్ల దుస్థితి

ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు కఠినంగా మారాయి. ఇంధన ధరలు, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వైద్య ఖర్చులు విపరీతంగా పెరగడం వలన వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు తీవ్రమైన కష్టాలు పడుతున్నారు. డీఏ/డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు అందకపోవడం వలన నెలవారీ ఆదాయం తగ్గి కుటుంబ ఖర్చులు నిర్వహించడం కష్టమైపోతోంది. సీపీఎస్‌లో ఉన్న ఉద్యోగులు ఓపీఎస్ రాకపోవడం వలన తమ ఉద్యోగ భవిష్యత్తుపై భయం, ఆందోళనతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులు, పెన్షనర్లు ఆవేదనతో, నిరాశతో జీవిస్తున్నారు. హామీలను నెరవేర్చని ప్రభుత్వంపై అసహనం పెరుగుతోంది.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు నమ్మకం కోల్పోతున్నారు. ప్రభుత్వ విశ్వసనీయతను నిలుపుకోవాలంటే వెంటనే డీఏ/డీఆర్ బకాయిలు విడుదల చేయాలి, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి, పీఆర్‌సీ కమిషనర్‌ని నియమించాలి, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి. ఇలా చేస్తేనే ఉద్యోగులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేరతాయి. లేకపోతే వారిలో మరింత అసంతృప్తి, ఆగ్రహం పెరిగి, ప్రభుత్వంపై నమ్మకం పూర్తిగా కోల్పోయే పరిస్థితి తలెత్తుతుంది.

ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ పెన్షనర్లు హైదరాబాద్‌లో
స్థిరపడ్డ వారి సంఘం
సెల్: 9703425006

జీఎస్టీ కొత్త స్లాబులు పండగా?దండగా! ?

ప్రొఫెసర్ పీటా బాబీ వర్ధన్

ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'పండుగ చేస్కోండి'అని అట్టహాసంగా ప్రకటించిన 'వస్తు సేవల పన్ను' (జీఎస్టీ)విధానం చూస్తుంటే అక్బర్-బీర్బల్ కథ గుర్తుకు వస్తోంది... కొందరికి తెలిసిందే అయినా సందర్భోచితంగా వుంటుందని ఉటంకించాల్సి వచ్చింది. అక్బర్ తన మంత్రి బీర్బల్‌తో కలిసి ప్రజల కష్టసుఖాలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామీణ ప్రాంతాలకు వెళ్తాడు... ఒక గొర్రెల కాపరి తన 20 గొర్రెలను పెంచేందుకు జాగాలేక కష్టంగా ఉందని గోడు వెళ్ల గక్కుతాడు. అక్బర్ బీర్బల్ని ఏం చేద్దామని అడుగుతాడు బీర్బల్ బాగా ఆలోచించి మరో ఇరవై గొర్రెలను ఇద్దామని చెబుతాడు. గొర్రెల కాపరి విస్తుపోతాడు. కానీ రాజుకి ఎదురు చెప్పలేక భయంతో ఒప్పేసుకుంటాడు. ఇప్పుడు మొత్తం 40 గొర్రెలు. ఇబ్బంది మరీ ఎక్కువయింది గొర్రెల కాపరికి. ఒక వారం తరువాత రాజు, మంత్రి గొర్రెల కాపరి ఇంటికి వెళతారు. ఎలావుంది జీవితం అని ప్రశ్నిస్తారు. చాలా కష్టంగా ఉంది రాజా అని వాపోతాడు గొర్రెల కాపరి. అయితే పది గొర్రెల్ని తిరిగి ఇచ్చేయమంటాడు మంత్రి. సంతోషంగా ఇచ్చేస్తాడు గొర్రెల కాపరి. ఇప్పుడు 30 గొర్రెలే తన దగ్గర ఉన్నాయి అని ఊపిరి పీల్చుకుంటాడు. మరో వారం తర్వాత మళ్లీ వస్తారు అక్బర్, బీర్బల్. ఎలావుంది జీవితం అనడిగితే, ప్రశాంతంగా ఉందని చెబుతాడు గొర్రెల కాపరి. మరో పది గొర్రెలను తీసుకుంటాడు బీర్బల్. మహదానంద పడిపోతాడు గొర్రెల కాపరి. ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెనుతిరుగుతారు రాజు మంత్రి. ఇప్పుడు గొర్రెల కాపరి దగ్గర 20 గొర్రెలే ఉంటాయి. అంటే ముందుగా తన వద్ద ఉన్నవే మిగిలాయన్న మాట. మరో వారం తర్వాత అక్బర్, బీర్బల్ మళ్లీ వచ్చి గొర్రెల కాపరి పరిస్థితిని వాకబు చేస్తారు... గొర్రెల కాపరి పట్టలేని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అవుతాడు. 'మహాప్రభూ...నా కష్టాలు తీర్చారు. మీరు దయార్థ హృదయులు' అంటూ కాళ్లమీద పడబోతాడు...అక్బర్, బీర్బల్ తమ 'మంత్రం' పనిచేసినందుకు మనసులో పరి పరి విధాల పొంగి పోయి నిష్క్రమిస్తారు. ఇదిగో అచ్చం అలానే ఉంది సీతమ్మ సెలవిచ్చిన పండుగ సందేశం!

ఒకదేశం-ఒకే పన్ను నినాదమా ! విధానమా?

ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక 'వన్ నేషన్-వన్ టాక్స్ (ఒక దేశం-ఒకే పన్ను)' అని కొత్త పల్లవి అందుకుంది. సాధారణంగా ఇలాంటి విధాన నిర్ణయాలు పూర్తిగా చర్చలు జరిపాక, సభల అనుమతితో చేయాలి. లేదా విపక్షాలు, ప్రజల డిమాండు మేరకైనా అమల్లోకి తేవాలి. అదేమీ లేకుండానే సభల్లో సంఖ్యాబలం ఉందన్న కారణంతో సదరు కొత్త పన్నుల విధానాన్ని 2017 జులై1న ప్రవేశ పెట్టింది ఎన్డీయే సర్కారు. దానికోసం 101వ రాజ్యాంగ సవరణ చేశారు. రక,రకాలైన పన్నులను సులభతరం చేసేందుకు ఈ విధానాన్ని తెచ్చినట్టు ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో భారీ మార్పులు చేసింది.. జీఎస్టీ ఫలితంగా కేంద్ర ప్రభుత్వ వస్తు సేవా పన్ను, రాష్ట్ర ప్రభుత్వ వస్తు సేవల పన్ను వసూళ్లు అమల్లోకి వచ్చాయి. జీఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ప్రతి మూడు మాసాలకు ఒకసారి రాష్ట్రాల వాటాను బదిలీ చేయడం రివాజు. 5,12,18,28,40 శాతాలుగా ఐదు స్లాబులుగా పన్నులు వసూలు చేస్తూ వచ్చారు. ఇది విప్లవాత్మక చర్యగా ఊదరగొట్టేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం నోరు మెదపలేని పరిస్థితి ఏర్పడింది. వార్షికాదాయం రూ.40 లక్షల దాటిన వ్యాపారస్తులు జీఎస్టీ పరిధిలోకి వస్తారు. రూ.20 లక్షల వార్షికాదాయం కలిగిన సేవారంగాన్ని కూడా పన్నుల పరిధిలోకి తెచ్చారు. డిజిటల్ లావాదేవీలు వల్ల పన్ను చెల్లింపు నుంచి తప్పుకునే అవకాశం లేకుండా పోయింది.. ఒకప్పుడు 'ఆధార్' కార్డు నిర్ణయాన్ని తీవ్రంగా



వ్యతిరేకించిన ఎన్డీయే ఇప్పుడు ఆధార్‌తో అన్నింటినీ అనుసంధానం చేసి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తోంది. పచారీ కొట్ల నుంచి వీధి వ్యాపారులకు సైతం డిజిటల్ లావాదేవీలు తప్పనిసరి చేయడంతో వ్యాపారులకు చిక్కులొచ్చాయి. ఫలితంగా బెంగళూరు లాంటి కాస్మో సిటీల్లో వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలు బహిష్కరించారు. ఇది దేశమంతా విస్తరించే ప్రమాదం ఉందని గ్రహించి, ఇప్పుడు 'సవరణలు' అంటూ కొత్త రాగం అందుకుంది కేంద్ర సర్కారు. సామాన్య ప్రజలకు వరాల జల్లు అంటూ నిర్మలమ్మ కచేరీ మొదలు పెట్టారు. ఇక ప్రధాని మోదీ అయితే 'దీపావళి ముందే వచ్చిందహో' అంటూ టముకు వాయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆనందానికి పట్టపగ్గాలే లేకుండా పోయాయి. అసెంబ్లీ సమావేశాల్లో ప్రశంసల జల్లు కురిపించారు. తీర్మానం చేసి మరీ నిర్మలమ్మ, మోదీలకు జేజేలు పలికారు.

ఇప్పుడే ఎందుకింత హడావుడి ?

ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి అంశాన్ని రాజకీయాలకు ముడిపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి బోలెడన్ని ఉదంతాలు... కర్నాటక ఎన్నికలప్పుడు 'బురఖా'ను ప్రధాన అంశంగా మార్చింది. అయినా విజయం సాధించలేకపోయింది. తర్వాత వచ్చిన ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో అయోధ్య రామమందిరాన్ని తెరమీదకు తెచ్చారు. అయితే అనూహ్యంగా ఫలితాలు నిరాశను మిగిల్చాయి. ఇప్పుడిక బీహార్ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి.. జీఎస్టీ మంత్ర దండాన్ని బయటకు తీశారు. సంస్కరణలు అంటూ జపం చేస్తున్నారు. కొత్త స్లాబుల వల్ల మధ్యతరగతికి మేలు జరుగుతుందని నమ్మ బలుకుతున్నారు. ఇప్పుడు మేలుజరుతుంది అనంటే ఇన్నాళ్లు కీడు జరిగిందని ఒప్పుకున్నాట్టేనా ? ఇదే ఇప్పుడు భేతాళ ప్రశ్న! జీఎస్టీకి సవరణలు చేయమని ఎవరు అడిగారు ? విప్లవాత్మకమైన విధానమని ఊదర కొడుతున్న సర్కారు ఇతర దేశాలలో ఇప్పటికే అమల్లో ఉన్నట్టు గ్రహించకపోవడం ఏమిటన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వగలదా ? ఎప్పుడూ సింగపూర్ జపం చేసే ఎన్డీయే భాగస్వామి చంద్రబాబుకైనా ఆ దేశంలో 7.5 శాతం ఏకపన్ను విధానం అమల్లో ఉన్నట్టు తెలియదా? ఇప్పుడు తీసుకొచ్చిన సవరణలు ఎవరికి ఎంత మేరకు ఉపయోగ పడతాయోనన్నది ఇంకా సందిగ్దమే. మందులు, బీమా ప్రీమియం చెల్లింపులకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామమే. మరికొన్ని నిత్యావసర వస్తువుల మీదా జీరో పన్ను నిర్ణయం కూడా శుభపరిణామమే. కొత్త పన్ను స్లాబుల విధానం అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా చాలా మంది వ్యాపారులు ఇంకా పాత పన్నులే వసూలు చేస్తుండటం గమనార్హం. పాత నిల్వల ధరలకు పాత పన్నులే అని కొందరు, సాఫ్ట్‌వేర్ అప్డేట్ కాలేదని ఇంకొందరు మెలికలు పెడుతున్నారు. మరి పండుగ ముందే వచ్చిందన్న ప్రకటనకు అర్థమేముంది? కొన్ని వస్తువుల మీద పన్ను తగ్గింపులు నిజమే అయినా, వాటి ప్రయోజనాలు ప్రజలకు చేరతాయా లేదా అన్నది అనుమానమే. ఎందుకంటే కంపెనీలు తగ్గించేలా అజమాయిషీ చేసే "యాంటీ ప్రాఫిటీరింగ్ కమిటీ"ని ప్రభుత్వం ఇప్పటికే రద్దుచేసింది. పర్యవేక్షణ యంత్రాంగం లేనప్పుడు వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపూ ఉంటుందా? వ్యాపారులు తగ్గింపు పన్నుల ప్రయోజనాలను వినియోగదారులకు చేరనిస్తారన్న నమ్మకం లేదు. ఏడెనిమిదేళ్ల పాటు దోపిడీ చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టి, ఇప్పుడు హఠాత్తుగా ఉపశమనం పూత పూయడమే ప్రభుత్వ 'రహస్య అజెండా' గా కనిపిస్తోంది. పైగా కొన్ని రకాల వస్తువులు, పనిముట్లు మీద గతంలో 18 శాతం ఉన్న పన్ను ఇప్పుడు 40 శాతంగా పెరిగింది. ఉదాహరణకు లక్జరీ కార్లు 40 శాతం స్లాబులోకి వెళ్లాయి. దిన కూలీలు, చిన్నాచితకా కార్మికులు, రిక్షా పుల్లర్లు, ఆటో డ్రైవర్లు ఎక్కువగా వినియోగించే పాన్ పరాగ్ వంటి పొగాకు ఉత్పత్తుల మీద 40 శాతం పన్ను విధించారు. ఖరీదు పెంచితే వినియోగం తగ్గుతుందన్న ఆలోచన కాబోలు. కానీ ఇలాంటి వస్తువుల వినియోగంలో ఏమాత్రం తగ్గుదల వుండకపోవచ్చు. మరింత ఖర్చు చేసి వీటిని కొనుగోళ్లు చేస్తారు తప్ప, మానేయడం అంత తేలికకాదు.దీనివల్ల ఖర్చు మరింత పెరిగి దిగువ మధ్యతరగతి వర్గాల కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉంది. దానికి బదులు ఉత్పత్తి ఆపేయడమో, నిషేధం విధించడమో చేస్తే మేలు జరుగుతుందేమో చూడాలి. దీనికి కార్పొరేట్ సంస్థలు ససేమిరా అంటాయని ఏలినవారికితెలియకుండా ఉంటుందా !

నల్ల ధనం వెలికి తీసేందుకంటూ పెద్దనోట్లను ఉపసంహరిస్తున్నట్లు 2016 నవంబరు 8 రాత్రి ప్రకటన చేశారు. తెచ్చిన సొమ్మును పేదలందరి ఖాతాల్లో జమచేస్తామని నమ్మబలికారు..2023 లో హఠాత్తుగా రెండు వేల నోట్లు మాయమయ్యాయి. దీనిద్వారా నగదురహిత లావాదేవీలు పెరుగుతాయని, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రకటించారు. ఉగ్రవాదులకు నగదు సమకూర్చేందుకు అక్రమ మార్గాల ద్వారా చేసే ధనార్జన తగ్గుముఖం పడుతుందని ప్రభుత్వం తెలిపింది. ఎవరి ఖాతాల్లోనూ డబ్బులు జమకాకపోవడం సంగతి అటుంచితే కార్పొరేట్లకు వేల కోట్ల మేర రుణ మాఫీ జరిగింది..దీంతో కార్పోరేట్ల అండ, ఆసరా లేనిదే రాజకీయ పార్టీలు మనుగడ సాగించలేవని మరోసారి రుజువయింది.. ఇదిలా ఉండగా సెప్టెంబర్ నెలాఖరు నుంచి ఏటీఎంలలో 500 నోట్లు ఉంచడాన్ని బాగా తగ్గించాలని అన్ని బ్యాంకులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది.. ఇదే జరిగితే రెండు వందలు, వంద నోట్లే పెద్ద నోట్లుగా చెలామణి అవుతాయనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. దీని ప్రభావం మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల మీద తీవ్రంగా పడుతుంది. చిన్న చితకా వ్యాపారులు పన్నులు కట్టలేక దిగాలు పడతారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమలు కరోనా కాలంలో ఎన్ని కష్టాలు పడ్డాయో తెలిసిందే. స్టార్టప్ పరిశ్రమల పరిస్థితి మరింత దారుణం. వ్యాపారాలు లేక పన్నులు చెల్లించలేక దివాళా తీసిన పరిశ్రమలు కోకొల్లలు. బడావ్యాపారులు కాదు కనుక వీరికి రుణమాఫీలు వర్తించవు. ప్రస్తుతం సంస్కరణలు పేరుతో జనం మీదకు వదిలిన దీపావళి పన్ను స్లాబుల టపాసులు పేలతాయో, పేల్చేస్తాయో వేచి చూడాల్సిందే..!!

జర్నలిజం విభాగపు పూర్వ అధిపతి&డీన్
ఆంధ్ర విశ్వవిద్యాలయం, సెల్: 9393100566.

పీ4తో పేదరిక నిర్మూలన అసాధ్యం

ముప్పాళ్ళ భార్గవ శ్రీ

రాష్ట్రంలో కూటమిక ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జీరో పావర్టీ (పేదరికము లేని) లక్ష్యాన్ని సాధించటానికి 2025 మార్చి 30వ తేదీ ఉగాది రోజున విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చంద్రబాబు ఆర్భాటంగా పీ4 ప్రారంభించారు. పీ4 అంటే... పబ్లిక్-ప్రైవేట్-ప్రజల-భాగస్వామ్యం... అని అర్థం చెప్పారు. చంద్రబాబు విజన్‌లో ముఖ్యమైన "స్వర్ణాంధ్ర 2047 విజన్"లో భాగంగా రాష్ట్రంలో పేదరికాన్ని 2029 నాటికి నిర్మూలించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రకటించారు. ఈ పథకాన్ని ఏప్రిల్ 5వ తేదీన ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ముప్పాళ్ల గ్రామంలో, ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో ప్రజా వేదికల పేరుతో బహిరంగ సభలు నిర్వహించి మార్గదర్శి, బంగారు కుటుంబాలను ఎంపికచేసే బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పజెపుతున్నట్లు ప్రకటించారు. ఒక పక్కన ఇది స్వచ్ఛంద కార్యక్రమం అని ప్రకటిస్తూ ప్రభుత్వ అధికారులకు బాధ్యతలు అంటగడు తున్నారు.

ఈ క్రమంలోనే ఉపాధ్యాయులు కూడా మార్గదర్శకులుగా మారాలని ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ప్రకటించటంతో, దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయటంతో అధికారులు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇప్పుడు మరొక అడుగు ముందుకువేసి బాధ్యతలను సచివాలయ సిబ్బందికి అప్పచెపుతున్నట్లు సెప్టెంబర్ 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలలో 14,954 సచివాలయాలను 2,14,084 క్లస్టర్లుగా విభజించి, ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి మూడు క్లస్టర్ల బాధ్యత తీసుకోవాలని, మార్గదర్శి బంగారు కుటుంబాల మధ్య సమన్వయం చేయాలని, ఈ మొత్తం కార్యక్రమం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని ప్రకటించింది. దీనిని బట్టి మొత్తం పీ4 పథకాన్ని అమలు చేసే బాధ్యతను సచివాలయ ఉద్యోగులపై పెట్టింది. ఈ కార్యక్రమ బాధ్యతను ఉపాధ్యాయులపై పెట్టి ఏ విధంగా వ్యతిరేకత తెచ్చుకుందో అలాగే వివిధ రకాల పనులభారంతో సతమతమవుతున్న సచివాలయ ఉద్యోగులనుంచి తీవ్ర వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోబోతున్నది. ఈ పథకాన్ని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉగాదిరోజున ప్రారంభించి ఆగస్టు 19వ తేదీన మంగళగిరిలో అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. చంద్రబాబు తాను స్వయంగా కుప్పం నియోజకవర్గం నుంచి 250 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఏ మాత్రం మనసున్నా పీ4 ఆచరణ సాధ్యమే అని చంద్రబాబు ప్రకటించారు. నానాటికి సమాజంలో ధనిక పేద అంతరాలు పెరిగిపోతూ ఉండటంతో పేద వర్గాలలో నిరాశ నిస్పృహలు నానాటికి పెరుగుతున్నాయి. సమాజంలో పేదరికం పెరగటానికి గల మూలకారణాల్లోకి వెళ్లకుండా చిట్కా వైద్యాలతో రోగాలను పోగొడతాం అనే చిట్కా వైద్యులు లాగా చంద్రబాబు వైఖరి పైకి కనిపిస్తోంది. కానీ ఆయన ఒక విజన్ ప్రకారం అద్భుతాలను సృష్టిస్తున్నానని, దానిలో భాగంగా తాను కనుగొన్న విజన్ 2020 ప్రకారం హైదరాబాదులో హైటెక్ సిటీని సృష్టించి అభివృద్ధిని సాధించానని, ఇప్పుడు విజన్ 2047 ప్రకారం పేదరికాన్ని నిర్మూలించి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా చేస్తానని పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నారు. ఈ విధంగా ప్రచారం చేయగలగటానికి చంద్రబాబు విజన్‌తో ముందుకెళ్లడానికి కర్త కర్మ క్రియ ప్రపంచ బ్యాంకు రూపొందించిన నూతన ఆర్థిక విధానాలేనని వేరే చెప్పనవసరం లేదు. ఇందుకు తార్కాణం చంద్రబాబు తాను ప్రపంచ బ్యాంకు సీఈఓ నని గర్వంగా చెప్పుకోవటమే! పీవీ నరసింహారావు కాలంలో ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాలలో భాగమైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను చంద్రబాబు అమలు చేయడంలో ఆనాటినుంచి పోటీ పడుతూనే ఉన్నారు. చంద్రబాబు విజన్ 2047 ఆ విధానాలలో భాగమేనని వేరే చెప్పనవసరంలేదు. ఆ విజన్‌కు పుట్టిన మానస పుత్రికే పీ4 పథకం. పేదరికంలేని సమాజం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఒక్క మన రాష్ట్రంలోనే ఎలా సాధ్యం అవుతుంది! ఈ పీ4 భ్రమల నుంచి చంద్రబాబు త్వరగా బయటపడాలని, లేకుంటే గతంలోలాగా అసలు అధికారానికే ముప్పు వస్తుందని చంద్రబాబు శ్రేయోభిలాషులు హెచ్చరిస్తున్నారు. అయినా చంద్రబాబు ఇవేమీ పట్టించుకోకుండా పీ4 పథకాన్ని అమలు చేయటానికి ఈ పథకం అమలు పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన సంస్థకు వైస్ చైర్మన్‌గా గతంలో ప్రణాళికాశాఖ చైర్మన్‌గా పనిచేసిన సి కుటుంబరావుని కూడా నియమించారు. పేదరికంలేని సమాజం ఒక్క మన రాష్ట్రంతోనే సాధ్యం కాదు అన్న విషయం జగమెరిగిన సత్యం.

ఈ సత్యం చంద్రబాబుకు తెలియదా! ప్రపంచవ్యాప్తంగా సంపన్న దేశాలుగా ఉన్న అమెరికా, జపాన్, జర్మనీ, చైనా దేశాలలో కూడా పేదరికంతో ప్రజలు బాధపడుతూనే ఉన్నారు. వ్యక్తిగత ఆస్తిని వదిలిపెట్టి, మొత్తం వనరులను సమాజ పరంచేసి మనిషి మనుగడకు అవసరమైన మేరకే వనరులను ఉపయోగించుకునే ఆలోచన విధానాన్ని ఆచరణలో పెట్టేదే సమసమాజ దృష్టి. అటువంటి సామాజిక వ్యవస్థ సాధన కోసమే ఒక ప్రాపంచిక దృక్పథంతో కమ్యూనిస్టులు కృషి కొనసాగిస్తున్నారు. అటువంటి సామాజిక వ్యవస్థను సాధించనంత కాలం పేదరికం నిర్మూలించటం సాధ్యం కాదు! ఇది జగమెరిగిన సత్యం! మరి పేదరికం నిర్మూలిస్తామని, 2029 సంవత్సరం నాటికి పేదరికంలేని రాష్ట్రాన్ని నిర్మిస్తామని చంద్రబాబు పీ4 పథకం పేరుతో, తన అభిమానులు గట్టిగా వారిస్తున్నా ఎందుకు ముందుకే వెళుతున్నారు! ప్రజల బలహీనతలను తమ రాజకీయలబ్ధి కోసం వాడుకోవడమే ఇందులో ముఖ్యమైనది. ఈ విషయంలో చంద్రబాబుది అందెవేసిన చేయి. ఇతర రాజకీయ నాయకుల కంటే చంద్రబాబుకి ప్రపంచ బ్యాంకు స్థాయిలో విజన్ ఉండటమే దీనికి కారణం. రాజుల కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రజలు తమ దయ దక్షిణ్యాల మీద బతకాలి. ఈ ఫ్యూడల్ లక్షణాలలో భాగంగా భక్తి భావాలు పెరిగి జీవకారుణ్య సిద్ధాంతం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఉన్నవాడు లేనివాడికి సహాయం చేయటం అనేది ఈ జీవకారుణ్య సిద్ధాంతంలోని ముఖ్యవిషయం. దీని ప్రకారం సహాయం పొందిన పేదవారు ఎల్లకాలం కృతజ్ఞతా భావంతో ఉండిపోతారు. పీ4 పథకం ప్రకారం సహాయంచేసిన మార్గదర్శుల పట్ల పేదలకు చెందిన బంగారు కుటుంబాలు సహజంగా కృతజ్ఞతా భావంతో ఉంటాయి. ఈ విధంగా సహాయం పొందటానికి సూత్రధారుడైన చంద్రబాబు పట్ల మరింతగా కృతజ్ఞతా భావం వెల్లివిరిసి అది ఓట్ల రూపంలో చివరికి రుణం తీర్చుకుంటారనే ఆశ. దీనికంటే ముఖ్యమైనది పేదరికంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగి ఉద్యమాలవైపు ఆకర్షింపబడకుండా ఉండటం అనేది పాలకవర్గాలు అనుసరిస్తున్న రాజకీయ నీతి. ప్రపంచ బ్యాంకు విధానాలను నెత్తిన పెట్టుకొని ఊరేగుతున్న చంద్రబాబు అసలైన రాజకీయ నీతి ఇది.

పేదరిక నిర్మూలన అనేది ఈ వ్యవస్థకు సంబంధించిన అంశం. ఇది చంద్రబాబు నాయుడి పేటెంట్ హక్కు కాదు. ఈ ఒక్క రాష్ట్రంలోనే పేదరిక నిర్మూలన చేస్తామని చెప్పటం పేదలను మరికొంత కాలంపాటు వంచించటమే. పేదరిక నిర్మూలన జరగాలంటే ఈ వ్యవస్థలో సమూలమైన మార్పులు రావాలి. ఈ మార్పుల కోసం సంఘర్షణ అనివార్యం. ప్రజల శ్రమను దోచుకునే దోపిడీ శక్తులపై పోరాటం అనివార్యమని సమాజ పరిణామ చరిత్ర చాలా స్పష్టంగా మనకి బోధిస్తున్నది. పీ4 పథకం లాంటి తాత్కాలిక పథకాలతో పేదరికం సమూలంగా నిర్మూలన కాదు. పేదరికాన్ని పదికాలాలపాటు పెంచేవి మాత్రమే. కావున ప్రజలు తమ శ్రమకు తగిన ఫలితాన్ని సాధించే వర్గపోరాటాల ద్వారానే సాధించగలుగుతారని ఎలుగెత్తి చాటుదాం!

సెల్ నెం. 98481 20105

నేను వారాంతపు రాజకీయ నాయకుడిని కాదు: ఉదయనిధి స్టాలిన్

చెన్నై: తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తమిళ స్టార్ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ పై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. తానేమీ ఇతర నేతల్లా వారాంతపు రాజకీయ నాయకుడిని కాదంటూ విజయ్‌ని ఉద్దేశిస్తూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. కాగా, విజయ్ ప్రతి శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఉదయనిది... 'నేను వారంలో దాదాపు ఐదు రోజులు అధికారిక పర్యటనలతో బిజీగా ఉంటాను. ఆదివారాల్లో కూడా పర్యటిస్తాను. కొందరిలా శనివారాల్లో మాత్రమే బయటకు వచ్చే నాయకుడిని కాదు. ఆదివారాల్లో కూడా ప్రయాణిస్తూనే ఉంటాను. నేను వారంలో ఏ రోజు అని చూడను. ఈ రోజు ఏ రోజు అనేది నాకు తెలియదు' అంటూ వ్యాఖ్యానించారు. అవి విజయ్‌ని ఉద్దేశించే అని తెలుస్తోంది. ఉదయనిధి వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి.

మరోసారి అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లారు. రాహుల్ దక్షిణ అమెరికా పర్యటనకు బయల్దేరినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ పర్యటనలో భాగంగా బ్రెజిల్, కొలంబియాతో పాటు మరో రెండు దేశాల్లో కాంగ్రెస్ అగ్రనేత పర్యటించనున్నారు. అక్కడ రాజకీయ నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు, వ్యాపారవేత్తలతో సంభాషించనున్నారు. కాగా, గతంలో రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటించిన సమయంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. గత పర్యటనల్లో రాహుల్... భారత్‌లో మత స్వేచ్ఛ, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో తాజా పర్యటనలో ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారో అన్న చర్చ జరుగుతోంది.

అన్ని పార్టీలతో సఖ్యతగానే ఉన్నాం: డీఎండీకే

చెన్నై: అన్ని పార్టీలతోనూ డీఎండీకే స్నేహపూర్వకంగానే మెలగుతోందని, అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పొత్తుపై చర్చించేందుకు ఇప్పటి వరకు ఏ కూటమి నుంచీ తమకు ఆహ్వానం అందలేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత అన్నారు. శనివారం కోయంబేడులోని పార్టీ కార్యాలయం వద్ద తన ప్రచార వాహనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జనవరి 9న కడలూరులో పార్టీ మహానాడు జరుపనున్నామని, ఆ సభలోనే ఏ కూటమితో పొత్తుపెట్టుకుంటామనే విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తానన్నారు. నటుడు విజయ్ రాకతో రాష్ట్ర రాజకీయాల్లో తప్పకుండా మార్పు వస్తుందన్నారు. ఇటీవల సీఎం స్టాలిన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత తాను ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించానని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుటుంబ సభ్యులు, తమ కుటుంబ సభ్యుల మధ్య ఎన్నో యేళ్లుగా సన్నిహిత సంబంధాలున్నాయని, కెప్టెన్‌తో తన వివాహాన్ని జరిపింది కరుణానిధే అనే విషయం అందరికీ తెలిసిందేనని ఆమె చెప్పారు. విజయ్ సినిమాలలో రాణించినట్లు రాజకీయాల్లో రాణించడం సులువైన విషయం కాదని అభిప్రాయపడ్డారు.

డబ్బులు దొంగిలిస్తోందని కుమార్తెను హత్య చేసిన కసాయి తండ్రి

లక్నో: ఇంట్లో డబ్బులు దొంగిలిస్తుందని ఓ తండ్రి తన కుమార్తెనే హత్య చేశాడు. ఆ తర్వాత స్కూల్‌కు ఫోన్ చేసి తన కూతురు బంధువుల ఇంటికి వెళ్లిందని మూడు రోజులు రాదని చెప్పాడు. బాలిక మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు చివరకు ఆమె తండ్రిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో జరిగింది. బిచౌలా గ్రామానికి చెందిన సోనమ్ (13) ఏడో తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం అనుప్‌షహర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వంతెన కింద పొదల్లో స్కూల్ యూనిఫాంలో ఉన్న ఒక బాలిక మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్కూల్ డ్రెస్ ఆధారంగా మృతురాలిని సోనమ్‌గా గుర్తించారు. ఆమె చదువుతున్న స్కూల్‌లో ఆరా తీశారు. స్కూల్‌కు వెళ్లిన ఆ విద్యార్థిని తండ్రి అజయ్ శర్మ (40) బైక్‌పై తీసుకెళ్లినట్లు తెలుసుకున్నారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తన కుమార్తె కొన్ని రోజులుగా ఇంటి నుంచి డబ్బులు దొంగిలిస్తున్నదని అతడు ఆరోపించాడు. దీని వల్ల కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపాడు. ఈ నేపథ్యంలో కుమార్తెను స్కూల్ నుంచి పొలానికి తీసుకెళ్లి గొంతునొక్కి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. సోనమ్ మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు పోలీసులకు చెప్పాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి

చండీగఢ్: హర్యానాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి గురుగ్రామ్‌లోని జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా... ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... ఆరుగురు వ్యక్తులు (ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు) ఉత్తరప్రదేశ్ నుంచి గురుగ్రామ్‌కు థార్ కారులో వెళ్తున్నారు. శనివారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న వాహనం హైవే ఎగ్జిట్ నంబర్ 9 సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడ్డ ఇద్దరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జోధ్‌పూర్ సెంట్రల్ జైలుకు వాంగ్‌చుక్

- లద్దాఖ్‌లో కొనసాగుతున్న తనిఖీలు, గస్తీ
- పెద్ద ఎత్తున భద్రతాదళాల మోహరింపు

న్యూదిల్లీ/లెహ్ : పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం లద్దాఖ్‌లో అరెస్టు చేసిన తర్వాత ఆయనను జోధ్‌పూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. లెహ్‌లో ఇటీవల జరిగిన నిరసనల నేపథ్యంలో వాంగ్‌చుక్ అరెస్టు జరిగింది. అక్కడ నిరసనకారులు లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, 6వషెడ్యూల్ వర్తింపు సహా ఇతర విషయాలపై ఆందోళనలు చేస్తున్నారు. సెప్టెంబరు 24న లెహ్‌లో నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆ తర్వాత ఆ ప్రాంతంలోని బీజేపీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. హింసాత్మక నిరసనలలో నలుగురు మరణించిన రెండు రోజుల తర్వాత వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఏ) నిబంధనల కింద అదుపులోకి తీసుకున్నారు. వాంగ్‌చుక్ హింసను ప్రేరేపించారని ఆరోపించారు. రెండువారాలుగా నిరాహారదీక్షలో ఉన్న వాంగ్‌చుక్ హింస జరిగిన వెంటనే నిరాహార దీక్ష విరమించి... శాంతియుతంగా ఉండాలని ఆందోళనకారులకు పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో లద్దాఖ్‌ను చేర్చాలని, మరికొన్ని శాసన, న్యాయ అధికారాలతో స్వయంప్రతిపత్తి జిల్లా మండళ్లను ఏర్పాటు చేయాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తున్నారు. ఆర్టికల్ 244 కింద ఆరవ షెడ్యూల్ ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాలయిన అసోం, మిజోరం, త్రిపుర, మేఘాలయకు వర్తిస్తుంది.

నాల్గవ రోజూ కర్ఫ్యూ

జాతీయ భద్రతా చట్టం కింద వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత పోలీసులు, భద్రతా బలగాలు గస్తీ, తనిఖీలను ముమ్మరం చేశారు. హింస జరిగిన లేహ్ పట్టణంలో కర్ఫ్యూ నాల్గవ రోజు (శనివారం) అమలులో ఉందని అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలస్యంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో లెఫ్టినెంట్ గవర్నర్ నేతృత్వంలోని పరిపాలనా యంత్రాంగం వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సమర్థించింది. కాగా 'గత 24 గంటల్లో లడఖ్‌లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. శాంతిభద్రతలను కాపాడటానికి ఈ ఆంక్షలు అమలులో ఉన్నాయి' అని ఒక అధికారి తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా త్వరలో రాజ్ భవన్‌లో ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారని, కర్ఫ్యూను సడలించే నిర్ణయం దాని ప్రకారం తీసుకుంటామని ఆయన అన్నారు. మరోవైపు, ఘర్షణల తర్వాత 50 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కార్గిల్‌తో సహా కేంద్రపాలిత ప్రాంతంలోని ఇతర ప్రధాన పట్టణాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమావేశమవ్వడాన్ని నిషేధించే నిషేధ ఉత్తర్వుల కింద కఠినమైన ఆంక్షలు కూడా అమలులో ఉన్నాయి. సమాచార, పౌరసంబంధాల డైరెక్టరేట్ శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఒక ప్రకటనలో ఇలా పేర్కొంది : 'వాంగ్‌చుక్ రాష్ట్ర భద్రతకు హానికరమైన, శాంతి, ప్రజా క్రమం నిర్వహణకు, సమాజానికి అవసరమైన సేవలకు హానికరమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తరచూ గమనించడం జరిగింది. ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ముందు ముందస్తు సమావేశాల ప్రతిపాదనకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ, వాంగ్‌చుక్ తన దురుద్దేశంతో సెప్టెంబరు 10 నుంచి పట్టణంలో తన నిరాహార దీక్షను కొనసాగించాడు. అతని వరుస రెచ్చగొట్టే ప్రసంగాలు, నేపాల్ ఆందోళనలు, అరబ్ స్ప్రింగ్ మొదలైన వాటి గురించి ప్రస్తావించడం, తప్పుదారి పట్టించే వీడియోలు... సెప్టెంబరు 24న లేహ్‌లో హింసాత్మక నిరసనలకు దారితీశాయి. దీని ఫలితంగా నలుగురు వ్యక్తులు దురదృష్టవశాత్తూ మరణించారు' అని పేర్కొంది.

వాంగ్‌చుక్‌పై ఆరోపణలు నిజం కావు : కాంగ్రెస్

వాంగ్‌చుక్ లద్దాఖ్ వాసుల ఆందోళనకు అత్యంత స్పష్టమైన స్వర ముఖంగా మారారని కాంగ్రెస్ పార్టీ కేంద్ర పాలిత ప్రాంత విభాగం తెలిపింది. వాంగ్‌చుక్‌పై ఆరోపణలు నిజం కావని, వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడం వల్ల ఈ ప్రాంతంలో శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించడానికి సహాయపడుతుందని ప్రభుత్వం భావిస్తే అది చాలా తప్పు అని పేర్కొంది. కాగా, వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలని పంజాబ్ విద్యా మంత్రి హర్జోత్ సింగ్ బెయిన్స్ శనివారం డిమాండ్ చేశారు. వాంగ్‌చుక్ అరెస్టును 'ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి' అభివర్ణిస్తూ... వాంగ్‌చుక్ లద్దాఖ్ స్వరమని, ఆయన నేరస్తుడు కాదని స్పష్టం చేశారు.

వాంగ్‌చుక్‌కు పాక్ అధికారితో సంబంధాలు: డీజీపీ

వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని... పాక్‌తో పాటు బంగ్లాదేశ్‌ను కూడా ఆయన సందర్శించినట్లు లద్దాఖ్ డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ తెలిపారు. లేహ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ... పాక్‌కు చెందిన ఇంటెలిజెన్స్ అధికారి ఒకరితో వాంగ్‌చుక్‌కు సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. సదరు పాక్ ఐవోను పోలీసులు ఇటీవలే అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడితో వాంగ్‌చుక్‌కు సంబంధాలు ఉన్నట్లు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని వివరించారు. అంతేకాదు పాక్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి వాంగ్‌చుక్ హాజరైనట్లు కూడా తేలింది. అతను బంగ్లాదేశ్‌ను కూడా సందర్శించినట్లు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాలపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని డీజీపీ వెల్లడించారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు రెచ్చగొట్టే చరిత్ర ఉందని... ఎఫ్‌సీఆర్‌ఏ నిధుల ఉల్లంఘనకు సంబంధించి కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

టెరిటోరియల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీపీఎఫ్ ఘన విజయం

గువహతి: అస్సాంలో జరిగిన బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ (బీటీసీ) ఎన్నికల్లో హగ్రామా మొహిలరీ నేతృత్వంలోని బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) ఘన విజయం సాధించింది. 40 స్థానాలకు గాను 28 సీట్లు గెలుచుకుంది. గత కౌన్సిల్‌లో కూటమి భాగస్వాములైన యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) ఏడు, బీజేపీ ఐదు స్థానాల్లో విజయం సాధించాయి. అయితే గతంలో గెలిచిన 12, 9 స్థానాల కంటే ఈసారి తక్కువ సీట్లతో సరిపెట్టుకున్నాయి. గాయకుడు జుబీన్ గార్గ్ మరణం కారణంగా ఎన్నికలకు మూడు రోజుల ముందు ప్రచారాన్ని రద్దు చేయడం బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. కాగా, కోక్రాఝర్, చిరాంగ్, బక్సా, ఉదల్గురి, తముల్పూర్ అనే ఐదు జిల్లాలతో కూడిన 40 మంది సభ్యులున్న బీటీసీకు ఈ నెల 22న ఎన్నికలు జరిగాయి. బీపీఎఫ్ చీఫ్ మొహిలరీ, దేబర్‌గావ్ నియోజకవర్గం నుంచి గెలిచారు. అయితే యూపీపీఎల్‌లో చేరిన మాజీ సహచరుడు ఖంపా బోర్గోయరీ చేతిలో చిరాంగ్‌ద్వార్ స్థానాన్ని కోల్పోయారు. గోయిమారి స్థానంలో బీటీసీ చీఫ్ ప్రమోద్ బోరో గెలిచారు. బీపీఎఫ్‌కు చెందిన ప్రకాశ్ బసుమతరి చేతిలో డోట్మాలో ఓడిపోయారు. బోడోలాండ్ టెరిటోరియల్ రీజియన్ (బీటీఆర్) తదుపరి కౌన్సిల్‌ను ఎన్డీయే ఏర్పాటు చేస్తుందని అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ తెలిపారు. మరోవైపు 2020, జనవరి 27న దిల్లీలో జరిగిన బోడో ఒప్పందంపై సంతకం తర్వాత ఇది రెండవ కౌన్సిల్ ఎన్నికలు. 2020 ఎన్నికల్లో 17 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా బీపీఎఫ్ అవతరించింది. అయితే 12 స్థానాల్లో గెలిచిన యూపీపీఎల్, తొమ్మిది స్థానాల్లో రాణించిన బీజేపీ, ఒక్క సీటులో గెలిచిన గణ సురక్ష పార్టీ (జీఎస్పీ)తో కలిసి కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. అంతకు ముందు మూడేళ్ల వరుసగా కౌన్సిల్‌కు నేతృత్వం వహించిన బీపీఎఫ్ కూడా ఎన్డీయే కూటమిలో చేరింది. 2020 ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక స్థానాన్ని మాత్రమే గెలుచుకుంది. ఆ పార్టీ నుంచి ఎన్నికైన సభ్యుడు ఆ తరువాత బీజేపీలో చేరాడు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎవరూ గెలవలేదు.

నీరవ్ మోదీ బావకు క్షమాభిక్ష

న్యూదిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను రూ.వేల కోట్లు మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ బావ మయాంక్ మెహతాకు క్షమాభిక్ష మంజూరైంది. బ్రిటన్ పౌరుడైన మయాంక్ దాదాపు 35 ఏళ్లుగా హాంకాంగ్‌లో ఉంటున్నాడు. వివిధ కేసుల్లో మయాంక్ నిందితుడిగా ఉన్నాడు. మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో తనకు ఇప్పటికే క్షమాభిక్ష లభించిన విషయాన్ని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. విచారణకు సహకరించేందుకు 2021లోనే తాను స్వచ్ఛందంగా భారత్‌కు వచ్చిన విషయాన్ని ప్రస్తావించాడు. ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలను బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నానంటూ క్షమాభిక్ష కోరాడు. ఈక్రమంలో సీబీఐ ప్రత్యేక కోర్టు మయాంక్‌కు క్షమాభిక్ష ప్రసాదించింది. ఈ కేసులో అతడిని అప్రూవర్‌గా గుర్తించాలని ఆదేశించింది. నేరానికి దారి తీసిన పరిస్థితులు, ఇందులోభాగమైన వ్యక్తులకు సంబంధించి పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని షరతు విధించింది. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న నిందితుడు.. వీలైనంత త్వరగా భారత్‌కు వచ్చి, విచారణలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను దాదాపు రూ.13వేల కోట్లకు పైగా మోసం చేశారని 2018లో ఆరోపణలు వెల్లువెత్తిన అనంతరం మెహుల్ ఛోక్సీ , అతడి మేనల్లుడు నీరవ్‌మోదీ దేశం విడిచి పారిపోయారు. నీరవ్‌మోదీ బ్రిటన్ జైలులో ఉన్నారు. వీరిని తిరిగి తీసుకొచ్చేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

స్కూల్‌కు ప్రవేశ పరీక్ష...

సుప్రీంను ఆశ్రయించిన విద్యార్థి

న్యూదిల్లీ: స్కూల్లో ప్రవేశం పొందడానికి ప్రవేశపరీక్ష నిర్వహిస్తుండడంపై ఓ విద్యార్థి (11) సుప్రీంకోర్టు ను ఆశ్రయించాడు. ఈ విధానాన్ని ప్రశ్నిస్తూ... న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. దిల్లీలో సీఎం శ్రీ స్కూళ్ల లో అధికారులు 6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు కూడా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ... ప్రభుత్వ సర్వోదయ బాల్ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న జన్మేశ్ సాగర్ అనే విద్యార్థి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ చర్యలు ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం (2009) నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నాడు. 2025-26 విద్యా సంవత్సరానికి తాను సీఎం శ్రీ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నట్లు జన్మేశ్ సాగర్ పిటిషన్‌లో తెలిపాడు. జులై 23, 2025న జారీ చేసిన ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం... ఈ నెల 13వ తేదీన ప్రవేశపరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నాడు. ఇటువంటి ప్రత్యేక కేటగిరీ ఉన్న పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో తెలియజేశాడు. ఇందుకుగాను జులై 23 నాటి సర్క్యులర్‌ను రద్దు చేసి... ప్రవేశపరీక్షల ద్వారా కాకుండా లాటరీ వ్యవస్థ ద్వారా విద్యార్థులకు అడ్మిషన్లు నిర్వహించేలా పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరాడు.

రాజ్ కుంద్రాకు ఈడీ షాక్

బిట్‌కాయిన్ కేసులో ఛార్జిషీట్, శిల్పాశెట్టి పేరు ప్రస్తావన

న్యూదిల్లీ: బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా చుట్టూ న్యాయపరమైన ఉచ్చు బిగుస్తోంది. సంచలనం సృష్టించిన బిట్‌కాయిన్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో రాజ్ కుంద్రా పేరును చేర్చడంతో పాటు కీలక ఆరోపణలు చేసింది. క్రిప్టో కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా ఉన్న అమిత్ భరద్వాజ్ నుంచి రాజ్ కుంద్రాకు రూ.150 కోట్ల విలువైన 285 బిట్‌కాయిన్లు అందినట్లు ఈడీ తన ఛార్జిషీట్‌లో స్పష్టం చేసింది. కుంద్రా ఉద్దేశపూర్వ కంగానే ఈ బిట్‌కాయిన్ల లావాదేవీలను, వాటికి సంబంధించిన వాలెట్ వివరాలను దాచిపెట్టారని ఈడీ ఆరోపించింది. ప్రస్తుతం ఆ బిట్‌కాయిన్లు ఆయన నియంత్రణలోనే ఉన్నాయని, వాటి ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపింది. ఈ వ్యవహారంలో తన ఆదాయ వనరులను దాచిపెట్టేందుకు రాజ్ కుంద్రా తన భార్య శిల్పాశెట్టితో ఓ ఆర్థిక ఒప్పందం చేసుకున్నారని కూడా ఈడీ ఛార్జిషీట్‌లో ప్రస్తావించింది. అయితే శిల్పాశెట్టి దంపతులు ఇప్పటికే మరో కేసులోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేశారన్న ఆరోపణలపై కొద్ది రోజుల క్రితం ముంబై పోలీసులు రాజ్ కుంద్రాను విచారించారు. ఇదే కేసులో వారిద్దరిపై లుకౌట్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. తాజా పరిణామంతో శిల్పాశెట్టి, రాజ్ కుంద్రా దంపతులు మరిన్ని న్యాయపరమైన చిక్కుల్లో పడినట్టయింది.

అటార్నీ జనరల్‌గా వెంకటరమణి పునర్నియామకం

న్యూదిల్లీ: సీనియర్ న్యాయవాది ఆర్.వెంకటరమణి (75) మళ్లీ అటార్నీ జనరల్‌గా నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఆ పదవిలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వెంకటరమణిని అటార్నీ జనరల్‌గా నియమించేందుకు రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఆయన రెండేళ్ల పాటు అటార్నీ జనరల్‌గా పనిచేయనున్నారు. ఈ నెల 30న మూడేళ్ల పదవీ కాలం ముగియనున్నది. సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ స్థానంలో వెంకటరమణి 2022, సెప్టెంబరు 30న బాధ్యలు స్వీకరించారు. అటార్నీ జనరల్ అనేది రాజ్యాంగపరమైన హోదా. కేంద్ర క్యాబినెట్ పంపే ప్రతిపాదన ఆధారంగా రాష్ట్రపతి ఆ వ్యక్తిని నియమిస్తారు. దేశంలో ఏ కోర్టులోనైనా హాజరయ్యే హక్కు అటార్నీ జనరల్‌కు ఉంటుంది. సుప్రీంకోర్టు, హైకోర్టులతో పాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలకు వెంకటరమణి పనిచేశారు. న్యాయపరమైన అంశాల్లో అటార్నీ జనరల్ ప్రభుత్వానికి సలహా ఇస్తుంటారు. 1950, ఏప్రిల్ 13న పుదుచ్చేరిలో ఆయన జన్మించారు. 1977 జులైలో ఆయన తమిళనాడు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. 1979లో ఆయన సుప్రీంకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టారు. 1997లో సుప్రీంకోర్టు ఆయన్ను సీనియర్ న్యాయవాదిగా నియమించింది. లా కమిషన్‌లో మాజీ సభ్యుడిగా చేశారు. రాజ్యాంగపరమైన చట్టంలో ఆయన నిష్ణాతులు.

మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ధ్వంసం

ఆయుధాలు, పేలుడు సామాగ్రి స్వాధీనం

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా మెట్టగూడ క్యాంపు పరిసర ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పరచుకున్న ఆయుధాల ఫ్యాక్టరీని భద్రతాదళాలు ధ్వంసం చేశాయి. శుక్రవారం కోబ్రా బెటాలియన్, డీఆర్జీ, సీఆర్పీఎఫ్ దళాలు ఎరాపల్లి, కోయమెంటా గ్రామాల సరిహద్దుల్లో ఉన్న కొండలపై గాలింపు చేపట్టాయి. ఉదయం 11 గంటలకు కోయిమెంట అడవిలో జరిపిన గాలింపు చర్యల్లో మావోయిస్టు రహస్య కర్మాగారాన్ని కనుగొన్నాయి. ఇది ప్రధాన ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీ కేంద్రం గా ఉంది. భద్రత దళాలు దీనిని ధ్వంసం చేశాయి. ఆయుధ కర్మాగారం నుండి మిల్లింగ్ యంత్రాలు, బీజీఎల్ లాంచర్లు 2, బీజీఎల్ హెడ్లు 94, చేతి మర యంత్రాలు, గ్యాస్ కట్టర్లు, బీజీయల్ సెల్స్, బెంచ్ వైస్ లు, డైరెక్షనల్ ఐఈడీ పైపులు, మెటల్ మోడలింగ్ పాట్స్, బోర్వెల్ డ్రిల్లింగ్ బిట్లు, ట్రిగ్గర్ మెకానిజములు, స్టీల్ పైపులు (80), ఇనప వస్తువులతో సహా పెద్ద మొత్తంలో పరికరాలు, పేలుడు సామాగ్రి, సాంకేతిక పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి.

బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ప్రారంభం

న్యూదిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝూర్సుగూడలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌరశక్తితో పనిచేసే 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది.

భారత టెక్ దిగ్గజాల భాగస్వామ్యం

ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీ-డాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.

ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీ-డాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ ఛైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు.

చొరబాట్లకు ఉగ్రవాదులు సిద్ధం: బీఎస్ఎఫ్ ఐజీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ లో నియంత్రణ రేఖ వెంబడి లాంచ్ ప్యాడ్ల వద్ద ఉగ్రవాదులు కాపు కాస్తున్నారని బీఎస్ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు. కశ్మీర్ లోయలోకి చొరబడేందుకు ఉగ్రమూకలు నియంత్రణ రేఖ వెంబడి కాచుకుని ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందన్నారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని, చొరబాటుయత్నాలను భగ్నం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శీతాకాలం ప్రారంభానికి ముందు ఉగ్రమూకలు కశ్మీర్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంటారని బీఎస్ఎఫ్ ఐజీ అశోక్‌యాదవ్ తెలిపారు.

బాందిపొరా, కుప్వారా సెక్టార్లలోని ఎల్ఓసీ మీదుగా ఉన్న లాంచ్ ప్యాడ్‌లలో ఉగ్రవాదుల ఉనికి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉగ్రవాదులు కశ్మీర్‌లోకి చొరబడడానికి తగిన సమయం కోసం వేచి చూస్తున్నారని.. అయితే, వారి చొరబాటు యత్నాన్ని భగ్నం చేయడానికి జమ్మూకశ్మీర్‌లో బీఎస్ఎఫ్, సైన్యం అప్రమత్తంగా ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల కొన్నేళ్లలో ఉగ్రవాదుల చొరబాటు ఘటనలు తగ్గుముఖం పట్టినప్పటికీ... అడపాదడపా పర్వత ప్రాంతాలు, అడవుల గుండా ముష్కరులు సరిహద్దును దాటేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారిని బీఎస్ఎఫ్ దళాలు ఎప్పటికప్పుడు అడ్డుకుంటూనే ఉన్నాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజలు నమ్మి అధికారం ఇస్తే నమ్మకద్రోహం చేశారు

తెలంగాణ భవిష్యత్ నిర్మాణం చేసే బాధ్యత మీ చేతుల్లో ఉంది

గ్రూప్ -1 అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం.రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కొంతమందికి తెలంగాణ ప్రజలు నమ్మి అధికారం ఇస్తే వారు మాత్రం ప్రజలకు నమ్మకద్రోహం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం శిల్పకళా వేదికలో కొలువుల పండుగ కార్యక్రమంలో పాల్గొని గ్రూప్-1లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కొంతమంది అప్పుడప్పుడు తెలంగాణ ఎక్కడున్నది.. ఎక్కడ ఉంటది అని మాట్లాడుతున్నారని, కానీ తెలంగాణ ఇక్కడే ఉంది, ఇక్కడే ఉంటదని అనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇదే తెలంగాణ స్ఫూర్తి, చైతన్యం ఇది తెలంగాణ భవిష్యత్ అని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణలో ఎన్నో పోరాటాలు జరిగాయని, తెలంగాణ గడ్డకు ఒక చరిత్ర, పౌరుషం ఉన్నాయన్నారు. ఏ మారుమూల పల్లెకు, గూడెంకు వెళ్లినా ఆ స్ఫూర్తి కనిపిస్తుందని, కానీ కొంత మంది కారణజన్ములమని, వారి కుటుంబమే తెలంగాణ అని భావించారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు వారికి నమ్మి బాధ్యతలు అప్పగిస్తే నమ్మకద్రోహం చేశారని అలాంటి వారు నమ్మకద్రోహులుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయారన్నారు. పదేళ్లుగా గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించలేదంటే ఎంత బాధ్యతారాహిత్యం అని ప్రశ్నించారు ఒక యాదయ్య, శ్రీకాంతాచారి, ఇషాన్ రెడ్డి లాంటి వాళ్ల త్యాగాలను అపహాస్యం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో అర్హత లేని వారిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో సభ్యులుగా నియమించారని, ఫలితంగా ప్రశ్న పత్రాలు జిరాక్స్ సెంటర్‌లో కనిపించాయని ధ్వజమెత్తారు. అందుకే మేం అధికారంలోకి రాగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పరీక్షలు నిర్వహించాం.. ఇది కొంతమందికి నచ్చలేదని దుయ్యబట్టారు. కడుపునిండా విషం పెట్టుకుని మిమ్మల్ని ఎన్నిరకాలుగా అడ్డుకోవాలని చూశారో మీకు తెలుసన్నారు. కొంతమంది 2 కోట్లు, 3 కోట్లు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చామని ఆరోపించిండ్రు అయినా మీ భవిష్యత్ కోసం కొట్లాడామని చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, కేసులు వేసినా, తప్పుడు ప్రచారం చేసినా ఓపికతో దిగమింగా మని పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్ నిర్మాణం చేసే బాధ్యత మీ చేతుల్లో ఉందన్నారు. నవ్విన వాడి ముందు జారిపడ్డట్టు చెయ్యకండి.. ఒక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. మనమంతా కలిసి దేశానికి తెలంగాణ మోడల్ చూపిద్దామని, తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మీరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవిష్యత్ నిర్మాణం చేసేందుకు మీరు సహకారం అందించాలని కోరారు. మీ భవిష్యత్ కోసం శ్రమించిన తల్లిదండ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత మీదే అన్నారు. తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే మీ జీతాల్లోంచి పది శాతం కట్ చేసి వారి ఖాతాల్లో వేస్తామన్నారు.

తెలంగాణ రెపరెపలాడాలి, రైజింగ్ కావాలి : డిప్యూటీ సీఎం భట్టి

అనేక సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికిని రాష్ట్రాన్ని అజేయంగా నిలబడటానికి, తెలంగాణ రెపరెపలాడటానికి రైజింగ్ రావడానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాదులో జరిగిన కొలువుల పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం 40 ఏళ్ల పాటు ఇంత పెద్ద ఎత్తున పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నియామకాలు జరిగిన దాఖలాలు లేవని తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 562 మందికి ఏకకాలంలో నియామక పత్రాలు అందజేయడం ఎంతో గర్వకారణం అన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం నిరుద్యోగ యువత ఉరికంబాలు ఎక్కార ని, అగ్నికి ఆహుతి అయ్యారని, నాడు యువత చేసిన పోరాటం త్యాగాలను చూసి పార్లమెంట్లో బలం లేకున్నప్పటికిని సోనియాగాంధీ అన్ని పార్టీలను కలుపుకొని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలం పాటు ఈ ఉద్యోగాల కోసమైతే నిరుద్యోగులు పోరాటం చేశారో, ఆ ఉద్యోగాల ప్రస్తావన ఆనాటి పాలకులు తీసుకురాలేదని, గ్రూప్ పరీక్షల నిర్వహణ గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. కేవలం అప్పటి ప్రభుత్వ పెద్దలు వారు వారి కుటుంబ సంక్షేమం కోసమే పాకులాడారు తప్ప నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం కోసం రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన వారి గురించి ఆలోచించకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు వారి కుటుంబం కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనతో అనేకసార్లు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన గురించి చర్చించారని, ఎంత ఖర్చైనా వెనకాడకుండా కమిషన్ ప్రక్షాళన చేసి రిక్రూట్మెంట్ కోసం తమ ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతులు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు కారణమవుతున్న చెట్టు కొమ్మలు తొలగింపు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని కస్తూర్బా నగర్‌లో వర్షాలకు చెట్టుకొమ్మలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, వాటిని తొలగించా లని కరెంటు వైర్ల మీద పడి ఎర్తింగ్ వస్తుందని స్థానికులు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకురావడంతో కొమ్మలను తొలగించారు. సమస్యను ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తేవడంతో వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి చెట్టు కొమ్మలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏ.ఈ వెంకట్ రెడ్డి, ఆర్టి కల్చర్ విభాగం వెంకటేష్, బాబు, స్థానికులు హబీబుద్దీన్, బాలకృష్ణ, కృష్ణవేణి, ముంతాజ్, మునవీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ పండుగ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళా అధికారులు, ఉద్యోగినులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, మహిళా సంక్షేమానికి ట్రేడ్ మార్క్ గా ప్రజా ప్రభుత్వ పాలన ఉందన్నారు. తెలంగాణ మహిళల సాధికారత, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని వారు తెలిపారు. ప్రజా ప్రభుత్వానికి మహిళలు ఆశీస్సులు అందిస్తూ వెన్నుదన్నుగా నిలవాలని కోరారు.

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా వైద్య ఆరోగ్య, కో ఆపరేటివ్, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో అంబరాన్ని అంటే విధంగా బతకమ్మ

సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, డిఎం అండ్ హెచ్ ఓ ఉమాగౌరీ, కో ఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత సాంస్కృతిక కళాకారులు, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రకృతిని ప్రకృతితో పూజించే పండుగ బతుకమ్మ మరియు ప్రకృతి పరిరక్షణకు ప్రదాన్యత తెలియజేసే పండుగ బతుకమ్మ. తెలంగాణ అస్థిత్వానికి, సంస్కృతికి, వారసత్వానికి, సంప్రదాయానికి, సనాతన ధర్మానికి తెలంగాణ సామూహిక జీవన విదానానికి బతుకమ్మ ప్రతీక. బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా బతుకమ్మ వేడుకలను పిసిబి సనత్ నగర్ కార్యాలయంలో ఉద్యోగుల సంఘం నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో తంగేడు పూలు, గునుగు పూలు, బంతి పూలు చామంతులతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక చోట చెర్చి గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ చుట్టు తిరుగుతూ ఆట పాటలతో మహిళా ఉద్యోగులు సంబురాలు చేసుకున్నారు. అనంతరం బతుకమ్మలను నీటి తొట్టెలో నిమజ్జనం చేశారు. సాంకేతిక, శాస్త్రీయ, పరిపాలన, ఖాతాలు విభాగం ఉద్యోగులు, మహిళా సిబ్బంద్ది అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.

మల్కాజిగిరిలో దసరా ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు దసరా సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.ఈ.లక్ష్మణ్ మాట్లడుతూ దసరా పండుగ అందరికి శుభం కలిగించాలని, సంతోషంగా ప్రతి ఒక్కరు బతుకమ్మ, దసరా ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉప ఎన్నిక పారదర్శకంగా జరిగేలా అధికారులు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ వర్గ ఉప ఎన్నికలకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులు తటస్థంగా ఉంటూ నిబంధనలకు లోబడి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా సన్నద్ధంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి కర్ణన్ నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నోడల్ అధికారుల సన్నద్ధతను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల్లో నియమించకూడదని అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి నిర్వహించే శిక్షణ కార్యక్రమాలలో రిటర్నింగ్ అధికారి పాల్గొని నోడల్ అధికారులకు వారి బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. ఎన్నికలలో నోడల్ అధికారులందరి పాత్ర, బాధ్యత తెలిసేలా సమగ్రపాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధుల ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ట్రాన్స్పోర్ట్, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సీ-విజిల్, టోల్ ఫ్రీ నంబర్లు, ఇతర వ్యవస్థల ద్వారా వేగంగా స్పందించేలా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, గోడ రాతలు, హోర్డింగులను వేగంగా తొలగించాలన్నారు. సమీక్ష సమావేశంలో ఏసీ రెవెన్యూ, ఐటీ అనురాగ్ జయంతి, ఏసీ ఎలక్షన్స్ హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్లు అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవరావు, అదనపు కమిషనర్లు కె.వేణుగోపాల్, అలివేలు మంగతాయారు, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుడిలా మెట్రోలో మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మెట్రో" అనుభవాలను స్వయంగా తెలుసుకునేందుకు శనివారం మంత్రి శ్రీధర్ బాబు మెట్రో రైలులో ఆకస్మికంగా ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా టికెట్ కొని, తూర్పున ఉన్న నాగోల్ స్టేషన్ నుండి పశ్చిమాన ఉన్న ఐటీ కారిడార్ రాయదుర్గం వరకు ప్రయాణించారు. మెట్రో సేవలు, సౌకర్యాలు, స్టేషన్లలో భద్రత, రవాణా సవాళ్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రయాణీకులతో ముచ్చటించారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రవాణాను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది అని ఈ సందర్భంగా ప్రయాణీకులకు వివరించారు. నగరంలో ప్రజా రవాణా బలోపేతానికి ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలు, మెట్రో ఫేజ్ - 2 విస్తరణ, ఆర్ఆర్ఆర్, ఇతర భవిష్యత్తు ప్రణాళికలను ప్రయాణీకులకు వివరించారు. ఇది ప్రజా ప్రభుత్వం. ప్రశంసలను తీసుకుంట్లుగానే విమర్శలను స్వీకరిస్తామని చెప్పారు. భవిష్యత్తు తరాల కోసం పనిచేస్తున్న ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని, రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

పెద్దాపూర్ పంప్ హౌస్‌ను సందర్శించిన జలమండలి ఎండీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్ నగరానికి మంచినీటి సరఫరా చేస్తున్న మంజీరా పథకంలోని పెద్దాపూర్ లోని జలమండలి మంచినీటి శుద్ధి కేంద్రంలోని పేస్-3 పంప్ హౌస్‌లోకి వరద నీరు చేరింది. దీంతో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి పంపు హౌస్‌ను సందర్శించి పునరుద్ధరణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ పెద్దాపూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలకు పంపు హౌస్‌లోకి వరద చేరడంతో ముందస్తు జాగ్రత్తగా పంపింగ్ ప్రక్రియను నిలిపివేసిన్నట్టు అలాగే పంపు హౌస్ నుంచి నీటిని తోడి పునరుద్ధరణ పనులు చేపట్టినట్టు చెప్పారు. దీనివల్ల హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరా అంతరాయం ఏర్పడిందని, దీనికి ప్రత్యామ్నా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండీ చెప్పారు. భారీ వర్షపాతం కారణంగా గంటల వ్యవధిలో దాదాపు 120 మి.మీ. వర్షం కురవడంతో తొగరిపల్లి వాగు పొంగి ప్రవహించి పెద్దాపూర్ ఫేజ్-3 పంప్‌హౌస్, సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు చేరిందని వివరించారు. పంపుహౌస్ లోకి వరద నీరు చేరి హైదరాబాద్‌కు నీటిని పంపింగ్ చేసే పేస్-3 పంపులు నీట మునిగాయని, దీనివలన 34 ఎంజీడీల తాగునీరు తగ్గుతుంది. ఈ వరద నీటిని తోడి బయటకి పంపింగ్ ప్రక్రియ జరుగుతోందని, పంపులను విప్పి వర్క్‌షాప్‌కు తరలించి మరమ్మత్తులు చేపడతారని చెప్పారు. పునరుద్ధరణ పనులు అనంతరం యధావిధిగా పంపింగ్ మొదలవుతుందని ఆయన చెప్పారు. ఈ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి తిరిగి పంపింగ్ చేయడానికి మరో 48 గంటలు పడుతుందని, మంచినీటి సరఫరా ప్రభావిత ప్రాంతాల్లో ఇతర మార్గాల ద్వారా మంచినీటిని అందిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎండీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ట్రాన్సమిషన్ సీజిఎం బ్రిజేష్, ట్రాన్స్మిషన్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - షాద్‌నగర్ రూరల్ : తెలంగాణ ఉద్యమ కారుడు, బహుముఖ ప్రజ్ఞా శాలి, దివంగత స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు, అందించిన సహకారం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన పడిన తపనలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మహిళా రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జిల్లాలోని జెడ్.పి.టి.సి., ఎంపిపి. స్థానాల కొరకు ఎస్.టి,ఎస్.సి బి.సి., జనరల్ రిజర్వేషన్లకు సంబంధించి మహిళా రిజర్వేషన్ కొరకు లాటరీ పద్ధతిన కేటాయింపు నిర్వహించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్లు, బి.సి. డెడికేషన్ కమిటీ నివేదిక ప్రకారం బి.సి. రిజర్వేషన్ చేపట్టడం జరిగిందని తెలిపారు. జెడ్.పి.టి.సి. కొరకు 3 ఎస్.టి., 4 ఎస్.సి., 9 బి.సి., 5 సాధారణ స్థానాలు కేటాయించడం జరిగిందని, వీటిలో 9 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎం.పి.పి. కొరకు 3 ఎస్.టి., 4 ఎస్.సి., 9 బి.సి., 5 సాధారణ స్థానాలు కేటాయించడం జరిగిందని, వీటిలో 9 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌హెచ్‌ఓగా ఇన్స్‌పెక్టర్ ధనంజయ గౌడ్

విశాలాంధ్ర - కాప్రా : నాచారం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా పదవి బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్ ధనంజయ గౌడ్‌ను నాచారం డివిజన్ బారాస పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పోలీస్ స్టేషన్కు తరలి వెళ్లి ఇన్స్పెక్టర్ ధనుంజయకి పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు సాయి జన్‌శేఖర్ మాట్లాడుతూ నాచారం ప్రశాంతత వాతావరణంతో పాటు కులమతలకు అతీతంగా పండగలను జరుపుకొని శాంతియుతంగా ఉంటారని ఇన్స్పెక్టర్కు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, విట్టల్ యాదవ్, దాసరి కర్ణ, రామచందర్, భూపాల్ రెడ్డి, టేకి రాజశేఖర్, మక్బూల్, చంద్రశేఖర్, సుగుణాకర్, వాసు, రోహిత్, నరసింహ, యూసుఫ్, మల్లికార్జున్ గౌడ్, లడ్డు, జయరాజ్, బాలరాజ్, ఈశ్వర్, కిట్టు, హరీష్ ఫైజ్ గ్యాస్ ఉద్దీన్ సంతోష్ కోటి ముధసీర్ నాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే మూసీకి వరదలు : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రూ. 1,50,000 కోట్ల దోపిడీ కోసమే హైదరాబాద్ ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ వరదలో ముంచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ కిరాతక మనస్తత్వంతోనే వేలాది ప్రజల ఇండ్లు, ఆస్తులు మూసీ వరదలో చిక్కుకున్నాయని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడిన కేటీఆర్, హైదరాబాద్‌కు వరద ముప్పును తగ్గించేందుకు వందేళ్ల కిందట నిజాం ప్రభుత్వం నిర్మించిన ఉస్మాన్ సాగర్, గండిపేట చెరువులను వాతావరణ శాఖ హెచ్చరికలు రాగానే ఖాళీ చేసి మూసీ వరద నీటిని నిల్వ చేయాల్సి ఉంటుందని గుర్తుచేశారు. కానీ మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో దోపిడీకి పాల్పడేందుకు ఆ ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలన్న దురుద్దేశంతో రేవంత్ రెడ్డి ఆ చెరువులను ఖాళీ చేయించలేదని కేటీఆర్ ఆరోపించారు. అందుకే చరిత్రలో తొలిసారిగా ఇమ్లిబన్ బస్టాండ్‌ను వరద ముంచెత్తిందన్నారు. అనుముల బ్రదర్స్ అరాచకాలపై ఆగ్రహంగా ఉన్న కొడంగల్ ప్రజలు ఎలాగైనా రేవంత్‌ను ఓడించాలని కంకణం కట్టుకుని ఉన్నారని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించిన రేవంత్ రెడ్డి, రాబోయే ఎన్నికల్లో వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమన్నారు. రాష్ట్రానికి సిఎం రేవంత్ అయినా కొడంగల్‌కు మాత్రం ఆయన సోదరుడు తిరుపతి రెడ్డియే ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. కనీసం కౌన్సిలర్ కూడా కాని తిరుపతి రెడ్డికి కలెక్టర్లు, ఎస్పీలు వంగి దండాలు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కేసీఆర్ కట్టించిన భవనాలు, ఫ్లై ఓవర్లు, బ్రిడ్జిలకు రిబ్బన్ కట్ చేయడానికి రేవంత్ రెడ్డి, తిరుపతి రెడ్డిలు జేబులో కత్తెరలు పెట్టుకొని తిరుగుతున్నారని అయితే కాస్త జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మంచి పని కూడా చేయలేదని కేటీఆర్ విమర్శించారు. రాహుల్, రేవంత్, భట్టి సంతకంతో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరెవరికి ఎంతెంత బాకీ ఉన్నదో చెబుతూ తాము 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను తయారు చేశామన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రచారం కోసం ఇంటింటికీ వచ్చే కాంగ్రెస్ నేతలకు ఈ కార్డును చూపించి, బాకీ కట్టిన తరువాతే ఓటు అడగాలని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

హోప్ పౌండేషన్ 151వ వారం అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్కుమార్ ఆధ్వర్యంలో హుడాకాలనీలోని హెూప్ఫౌండేషన్ కార్యాలయం వద్ద ప్రతి శనివారం అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న సమారాధనలో భాగంగా ఈ శనివారంతో 151 వారానికి చేరుకుంది. సుమారు 1500 మంది పేదప్రజలు పాల్గొని అన్నసమారాధన గావించారు. ప్రతి శనివారం ఇక్కడికి వచ్చి కడుపునిండ భోజనం చేస్తున్నామని పలువురు పేద ప్రజలు తెలిపారు. రోజంతా కష్టపడితేగాని పూటగడవదు, కాని ప్రతి వారం ఇక్కడ మాత్రం ఉచితంగా భోజనం లభిస్తుందని వారు సంతోషం వ్యక్తం చేశారు. హెూప్ ఎ ండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాట బాటలు వేసిన

మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాట బాటలు వేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ తుమ్మల మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటం లో కీలక పాత్ర పోషించారని తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారని రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్యజించిన మహనీయుడని మంత్రి తుమ్మల కొనియాడారు. "కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక గొప్ప నాయకుడు. ఆయన తన జీవితాన్ని ప్రజల సేవకే అంకితం చేశారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు" అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన చేస్తున్నారని ముందు తరాలకు తెలిసేలా హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని అదేవిధంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ పేరు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని మంత్రి తుమ్మల తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా చేనేత కార్మికుల రుణమాఫీ చేశామని చేనేత రంగాన్ని ప్రోత్సహించటానికి సీఎం రేవంత్ రెడ్డి చొరవతో బతుకమ్మ చీరలు వర్క్ ఆర్డర్ తో చేనేత కార్మికులు నిలదొక్కుకునేలా ప్రజా ప్రభుత్వం చేనేత రంగానికి అండగా ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఎంతో గౌరవంగా, దేశభక్తితో నిర్వహించడం జరిగినది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త తెలంగాణ ఉద్యమంలో మార్గదర్శకుడైన కొండా లక్ష్మణ్ బాపూజీకి కమీషనర్ ఎ. శైలజా, అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ ఇ. శ్యామ్ సుందర్ రావు, మున్సిపల్ అధికారులు ఆఫీస్ స్టాఫ్ ఘన నివాళులర్పించారు.

కొండలక్ష్మణ్ బాపూజీ జీవితచరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి సందర్భంగా ముషీరాబాద్ ఇంకా తెలంగాణ భవన్‌లో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ, జీవిత చరిత్రను, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండా లక్ష్మణ్ విగ్రహాని ట్యాంక్ బ్యాండ్ జలదృశంలో నెలకొల్పిన ఘనత కెసిఆర్, బిఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కిందని అన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్‌లో జీఎస్టీ అభియాన్ కార్యక్రమం నాచారం డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో జీఎస్టీ అభియాన్ జిల్లా సభ్యులు ప్రకాష్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల కోసం జీఎస్టీ సవరణలు చేసి ధరలు తగ్గించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గోపాల్ గౌడ్, రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, "జీఎస్టీ సవరణలతో నాచారం డివిజన్‌లో ప్రజలకు ధరలు తగ్గి ఉపశమనం లభిస్తోంది. ఈ సంస్కరణలతో మోడీ పేద ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు" అని అన్నారు. తరువాత జిల్లా సభ్యులు ప్రకాష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పలు షాపులను సందర్శించి జీఎస్టీ సవరణలపై ప్రజల స్పందనను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు అభిషేక్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి, ఉప్పల్ మహిళ కన్వీనర్ అనిత పద్మారెడ్డి, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, మహిళ మోర్చా అధ్యక్షురాలు మంజుల వాణి, యువమోర్చా నాయకులు బాలకృష్ణ, డివిజన్ బీజేపీ నాయకులు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, ఆనంద్ గుప్తా, రమేష్, శ్రీనివాస్ యాదవ్, దర్శనాల వెంకటేష్, మూల వెంకటేష్, వరలక్ష్మి, లావణ్య, పార్వతి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తుంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్‌లో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేస్తోందని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈ సంవత్సరం నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయని, వేలాది మహిళలు రోడ్లపై, గ్రౌండ్లలో బతుకమ్మ ఆడుతూ సాంప్రదాయ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ బతుకమ్మను ఉద్యమ బావుటాగా ఎగరేసి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఒక చేతిలో జొన్న కంకి, మరో చేతిలో బతుకమ్మతో తీర్చిదిద్దడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని రగిలించారని గుర్తు చేశారు. కానీ కొంతమంది ద్రోహులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి, బోడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. షేక్‌పేట్ సక్కుబాయి గ్రౌండ్స్‌లో రేపు ఘనంగా బతుకమ్మ వేడుకలు జరగనున్నాయని వెల్లడించారు.

మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : చాదర్ ఘాట్ బ్రిడ్జి, ఎంజీబీఎస్ బస్ స్టేషన్ , మలక్ పేట లోని పునరావాస కేంద్రాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంట జలశయాల గేట్లు ఎత్తడంతో పై నుండి వస్తున్న వరద వల్ల చాదర్ ఘాట్ బ్రిడ్జి మునిగిపోవడంతో చాదర్ ఘాట్ బ్రిడ్జిని పరిశీలించారు. వరద ప్రభావం అధికంగా ఉండడంతో బ్రిడ్జిపై ప్రజలను ఎవరిని అనుమతించవద్దని పోలీసులను మంత్రి ఆదేశించారు. చాదర్ ఘాట్ బ్రిడ్జి సైడ్ వాల్స్ దెబ్బతినడంతో వరద తగ్గిన తరువాత వెంటనే బ్రిడ్జిపై నుండి ఎవరిని అనుమతించవద్దని సూచించారు. మూసి పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలు మునిగిపోవడంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారని ఇళ్ల వద్దకు ఎవరు రాకుండా చూసుకోవాలని తెలిపారు. రాత్రి వరద దాటికి మునిగిపోయిన ఎంజీబీఎస్ బస్ స్టేషన్ ను పరిశీలించారు.. బస్సులు డైవర్ట్ చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. జిల్లాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నయా రూట్లో వెళుండడంతో వాటి బస్సు సూచనలు ప్రజలకు తెలియజేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిహెచ్ఎంసి హైదరాబాద్ అధికారులకు సూచించారు. ఎంజీబీఎస్ బస్టాండ్ మునిగిపోయింది. పురానాపూల్ వంతెన పై నుండి వరద పోతుందని, ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రత్యక్షంగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. వరద వచ్చినప్పుడు ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు తాగునీటి సౌకర్యము, ఆహార పదార్థాలు, పిల్లలకు పాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. జిహెచ్ఎంసి, హైదరాబాద్ కలెక్టర్, హైడ్రా, పోలీస్ వివిధ విభాగాలు సమన్వయం చేసుకొని పనిచేస్తున్నారని, వర్షాలు ఊహించిన దానికన్నా ఎక్కువగా కురుస్తున్నాయని, ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. అత్యవసరమైతేనే తప్ప బయటకి ఎవరు రాకూడదని, బ్రిడ్జి పైనుండి వరదలు పోతుండడం వల్ల మూసి ప్రధానదారుల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉందన్నారు. రాత్రి ఒక్కసారిగా వరద రావడంతో ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లో ఉన్న ప్రయాణికులను రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిందని తెలిపారు. పండగ పూట ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండడానికి ప్రత్యామ్నాయ మార్గాల్లో బస్సులు నడుపుతున్నామని, ఉత్తర తెలంగాణ నుండి వెళ్లే ప్రయాణికులు జేబీఎస్ బస్టాండ్ నుండిచ వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు ఉప్పల్ నుండి, నల్గొండ వైపు వెళ్లే ప్రయాణికులు హయత్ నగర్ నుండి, మహబూబ్ నగర్ వైపు వెళ్లే ప్రయాణికులు అరంగర్ వైపు నుండి బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికులు లోకల్ బాసుల ద్వారా అక్కడికి వెళ్లి జిల్లా బస్సుల ద్వారా గమ్యస్థానాలకు వెళ్ళవచ్చున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని, చాదర్ ఘాట్ బ్రిడ్జి సైడ్ వాల్స్ కొట్టుకుపోయాయి, ఇంజినీర్స్ పరిశీలించిన తరువాతనే దానిని మళ్ళీ ఉపయోగిస్తామన్నారు. మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనకు పదవులను సైతం త్యజించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వరాష్ట్రం కోసం తన పదవులను సైతం త్యజించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు తన పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సహకార చట్టంలో అనేక మార్పులను తీసుకువచ్చి సహకార సంఘాల ద్వారా బడుగు, బలహీన వర్గాల బలోపేతానికి కొండా లక్ష్మణ్ బాపూజీ కృషి చేశారని, స్వరాష్ట్రంగా తెలంగాణ వచ్చేవరకు తాను ఎలాంటి పదవులను చేపట్టబోనని ప్రతిజ్ఞ చేశారని, 90 సంవత్సరాల వయసులోను సైతం ఆయన ఎలాంటి భయం లేకుండా రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. 110వ జయంతిలో భాగంగా కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకోవడం ఎంతో సంతోషమని అన్నారు. నివాళులర్పిస్తూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను నేటి యువతి, యువకులకు అందరికి తెలియాలన్నారు. నేటి యువతకు ఆయన పోరాటలు, త్యాగాలను సైతం తెలుకోవడంలో ప్రాధాన్యత చూపాలన్నారు. త్యాగాలకు మరో పేరైన కొండా లక్ష్మణ్ బాపూజీ గురించి అందరికీ తెలియజేయడంతోపాటు ఆనాడు పోరాటాలు చేసిన ఉద్యమకారుల గురించి కూడా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డి.కేషురాం, బిసి ప్రజా సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగ

విశాలాంధ్ర-దుండిగల్ : తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కార్యాలయం నందు కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో రంగురంగు పూలతో బతుకమ్మలను అలంకరించి పసుపుతో తయారు చేసిన గౌరమ్మకు బియ్యం పిండి, నువ్వులు, నూకలతో తయారు చేసి ప్రసాదంగా నివేదించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది మహిళలు సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మలను ఓచోట పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక ఆత్మకు ప్రతీకని, పూలతో సాగే ఈ పండుగ సాంప్రదాయ విలువలు, మహిళల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్ బాబు, మేనేజర్ లక్ష్మయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - తుర్కయంజల్: తుర్కయాంజల్ పురపాలక పరిధిలోని ఎస్ఎస్ఆర్ నగర్ కల్యాణ మండపంలో బతుకమ్మ పండుగను మున్సిపల్ కమీషనర్ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమనికి కమీషనర్ అమరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బతుకమ్మ పండుగ సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పురపాలక పరిధిలోని అన్ని వార్డుల సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా తయారు చేసిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. పోటీ రూపంలో నిర్వహించిన బతుకమ్మలలో కోహెడ బతుకమ్మకు మొదటి బహుమతి, మునుగనూర్, తుర్కయాంజాల్, కమ్మగూడ బతుకమ్మలకు రెండవ బహుమతి, ఇంజాపూర్, రాగన్నగూడ బతుకమ్మలకు మూడవ బహుమతి, తొర్రూరు, బ్రాహ్మణపల్లి బతుకమ్మలకు నాలుగవ బహుమతులు లభించాయి. రెవిన్యూ ఆఫీసర్ శ్రీనివాసులు, సానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, అకౌంటెంట్ ఉషా, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వినయ్, బాల్ రాజ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సురేష్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మాతని దర్శించుకున్న కార్పొరేటర్ రాగం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌లోగల ఓల్డ్ లింగంపల్లి విలేజ్‌లో ఏర్పాటు చేసిన దుర్గా మాత అమ్మవారిని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, ఎస్ఎల్‌వీడీసీ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, పురం విష్ణువర్ధన్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, భాస్కర్ రెడ్డి, అఖిల్, వినయ్, రేవంత్ రాజ్ ముదిరాజ్, భరత్ గౌడ్, కిరణ్ యాదవ్, రేవంత్, సాయి గౌడ్ మరియు హనుమాన్ యూత్ అసోసియేషన్ మెంబర్స్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను భావితరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ గుంటి నగేష్ కోరారు. శనివారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుంటి నాగేష్ మాట్లాడు తూ కొండ లక్ష్మణ్ బాపూజి ప్రజా సేవకే జీవితం అంకితం చేశారని, ఆయన జీవితం తెలంగాణ సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.తొలిదశ, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమా నికి స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాపూజీ కృషి చేశారనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో చరణ్ దాసు ధనుంజయ, పెండెం నరసింహారావు, విజయ్ తదితరులు బాపూజికి నివాళులర్పించారు.

బోయినపల్లి వినోద్ కుమార్‌ని కలిసిన రవి యాదవ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌ని వారి నివాసం లో గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్ మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగం పల్లి 106వ డివిజన్లో మారబోయిన రవి యాదవ్ నేతృత్వంలో మన బస్తి బాట కార్యక్రమం గురించి వివరంగా చర్చించారు. మన బస్తి బాట కార్యక్రమం విజయాలను వినోద్ కుమార్‌కి అవగాహన చేసారు, ప్రజల సమస్యల నేరుగా పరిష్కార ప్రక్రియపై చర్చ జరిగింది, వినోద్ కుమార్ అన్నా రవి యాదవ్ ప్రయత్నాలను అభినందించారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ "యువ నాయకులు ఇలా ప్రజల సమస్యలను నేరుగా అవగాహన చేసుకుని పరిష్కరించడం అత్యంత ప్రశంసనీయం. రవి యాదవ్ ఈ సేవా భావన అనుకరణీయమన్నారు.

జోయాలుక్కాస్ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: జోయాలుక్కాస్ వారి బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో చందా నగర్‌లో ప్రారంభం కానుండటంతో నగరం కాంతులీననుంది. ఈ ప్రత్యేకమైన ప్రదర్శన, నైపుణ్యం, అందం మరియు శాశ్వతమైన సొగసును ఆస్వాదించే వారి కోసం రూపొందించబడిన వజ్రాలు విలువైన ఆభరణాల అద్భుతమైన సేకరణను ప్రదర్శిస్తుంది. వైభవమైన పెళ్లి ఆభరణాల నుండి ఆధునిక శైలి నగల వరకు, ప్రదర్శనలోని ప్రతి ఆభరణం ఈ సందర్భం కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ పరిమిత ఎడిషన్ నమూనాలు ప్రదర్శన సమయంలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ డా. జోయ్ ఆలుక్కాస్ ఇలా అన్నారు: "బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోను చందా నగర్‌కు తీసుకురావడం మాకు చాలా సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లోని ఈ ప్రాంతం ఆధునిక, ఆత్మవిశ్వాసంతో కూడిన శైలిని ప్రతిబింబిస్తుంది, మా సేకరణ ఆ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, ధైర్యమైన, అందమైన అద్వితీయమైన డిజైన్‌లతో రూపొందించబడింది." ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రదర్శన సమయంలో ఒక లక్ష అంతకంటే ఎక్కువ విలువైన ప్రతి డైమండ్ ఆభరణాల కొనుగోలుపై కస్టమర్‌లకు ఉచితంగా 1 గ్రాము బంగారం నాణెం లభిస్తుంది.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ నిస్వార్థ సేవలు, ఉద్యమ ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి కమిషనర్, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యోద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాల్గొని అదే విలువలను జీవితాంతం పాటించారన్నారు. తెలంగాణలో పురుడుపోసుకున్న తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమం సహా అనేక ప్రజా ఉద్యమాలకు ఆయన ప్రత్యక్ష సాక్షిగా, మూడు తరాలకు వారధిగా నిలిచారని కమిషనర్ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు రఘు ప్రసాద్, వేణు గోపాల్, అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, అదనపు సీసిపి గంగాధర్, పిఆర్ఓ మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా వెలిమెల ప్రమోద్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేపట్టిన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, చేపట్టిన అన్నీ కార్యక్రమాలు విజయవంతం కావడంలో కీలక భూమిక వహించిన వెలిమెల ప్రమోద్ సేవలను గుర్తించి ఎంఆర్పీఎస్ రాష్ట్ర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగినది. ఈ నియామక పత్రాన్ని అంబేద్కర్ భవన్‌లో అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ ఇంత గొప్ప బాధ్యతను అప్పజెప్పిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగకి జిల్లా నాయకులకు, రాష్ట్ర నాయకులకు జిల్లా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు, నాపై ఉంచిన ఈ నమ్మకాన్ని ఎల్లవేళలా బాధ్యతగా నిర్వహిస్తానని తెలిపారు. ఇక ముందు చేపట్టే ఎటువంటి కార్యక్రమన్నాయిన విజయవంతం చేయడంలో నేను ముందుఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామరపు శ్రీనివాస్ మాదిగ ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి, వీఎస్.రాజు మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మైసగల్లా బుచేంద్ర మాదిగ, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాలు బీసీ రిజర్వేషన్లు వ్యతిరేకించొద్దు

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : అగ్ర వర్ణాలు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 42 శాతం బీసీ రిజర్వేషన్లు వ్యతిరేకించి గ్రామాలలో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతంకు రిజర్వేషన్లు పెంచడం ఇది బీసీల సుదీర్ఘ పోరాట విజయం అన్నారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉందన్నారు. అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇస్తే బీసీలు వ్యతిరేకించలేదని, కాబట్టి అగ్ర కులాలు బీసీ రిజర్వేషన్స్‌లకు అడ్డు పడొద్దని విజ్ఞప్తి చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. న్యాయబద్ధమైన బీసీ రిజర్వేషన్లకు అన్ని వర్గాల వారు సహకరించాలని, వ్యతిరేకించే వారి భరతం పడతామని హెచ్చరించారు. తెలంగాణ పోరాటం ఏ విధంగా జరిగిందో అదే విధంగా బీసీ ఉద్యమం జరగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కుల సంఘాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీలకు కల్పించిన రిజర్వేషన్ కాపాడుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, నాయకులు సీ.రాజేందర్, కోలా జనార్ధన్, పగిళ్ల సతీష్, సుధాకర్ ముదిరాజ్, మోదీ రాందేవ్, జి.అనంతయ్య, నందగోపాల్, బాలయ్య పాల్గొన్నారు.

శ్రీవారాహీ పాసుపత హోమంలో కొలను

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: శ్రీ కనకదుర్గ అమ్మవారి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం విజయదశమి మహోత్సవంలో భాగంగా ఆరవ రోజు వారాహీ అమ్మవారు అనుగ్రహిస్తుంది. వారాహి అమ్మవారు వరాలు ఇచ్చు తల్లి కోరిన కోరికలు తీర్చి అన్నిటా జయమును కలగజేయును కావున ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి, లీడర్ కొలన్ నరసింహారెడ్డి వారి ధర్మపత్ని పద్మమ్మ ప్రజలు కోరిన కోరికలు తీరాలి. అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని దోషములన్ని తొలగిపోవాలని కోరుతూ నిజాంపేట్‌లో వెలసినటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు అద్భుతమైన శ్రీ వారాహీ పాసుపతం హెూమంలో పాల్గొని అమ్మవారిని ఆరాదించారు. అనంతరం ప్రసాదాలతో మంగళ తోరణాల వాయిద్యాలతో అమ్మవారి విజయదశమి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదే విధంగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి తనయుడు కొలన్ తరుణ్ రెడ్డి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, కడియాల ఇందిరా, శ్రీశైలం యాదవ్, గిరీష్ కుమార్, నిజాంపేట్ గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు భారీగా పాల్గొన్నారు.

మాగంటి సునీతకి శుభాకాంక్షలు తెలియజేసిన ముషీరాబాద్ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ గారు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు, స్వర్గీయ మాగంటి గోపీనాథ్, సతీమణి మాగంటి సునితను ప్రకటించగా, శనివారం యూసఫ్‌గూడలోని కార్యాలయంలో మాగంటి సునితని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే, షేక్ పేట డివిజన్ ఇంచార్జి ముఠా గోపాల్ వారి తనయుడు ముఠా జై సింహా పాల్గొన్నారు.

బీజేపీది ప్రమాదకర సిద్ధాంతం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర–హైదరాబాద్: బీజేపీది అత్యంత ప్రమాదకరమైన సిద్ధాంతమని, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయం చేస్తోందని, కార్మిక, కర్షకుల శ్రమను దోపిడీ చేసి బడా బడా నాయకులకు దోచిపెడుతోందని సీపీఐ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలి, దడువాయి, చాట, స్వీపర్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ 2వ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఉమా మహేశ్వర హాలులో ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రద్ధ నంద్ గంజ్ హమాలీ జిల్లా భవనం నుంచి శివాజీ చౌక్, రైల్వే గేట్ అవుట్ గేట్ మీదుగా ఉమా మహేశ్వర హాలు వరకు వేలాది మంది ఏఐటీయూసీ మార్కెట్ యార్డు సంఘాల అధ్వర్యంలో జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పు గంగారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహా, సహాయ కార్యదర్శి ప్రవీణ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

అనంతరం కూనంనేని మాట్లాడుతూ నిజామాబాద్‌లో సీపీఐ అనుబంధ సంఘాల అధ్వర్యంలో మహాసభ ఘనంగా నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఏఐటీయూసీ చేసిన పోరాటాల ఫలితంగానే 50 కిలోల బస్తాలు రావడం గర్వకారణమన్నారు. పోరాటాల వల్లనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, హమాలీలకు సమగ్ర చట్టంతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు చట్టం ఉందని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీలతోనే ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎర్ర జెండా సత్తా చాటాలన్నారు. కమ్యూనిస్టులు భారతంలో కృష్ణుడు లాంటి వారని, కమ్యూనిస్టులు ఏ వైపు ఉంటే ఆ వైపు బలం ఉంటుందని తెలిపారు. ఎలాంటి స్వార్థం లేని సిద్ధాంతాలు గల పార్టీ సీపీఐ అని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అదాని, అంబానికి దోచిపెట్టి పేదలను మోసం చేస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టులు చేసే పోరాటం రాహుల్ గాంధీ కూడా చేస్తున్నారని, బీజేపీ చేస్తున్న అన్యాయాలను బయటకు తీసుకువస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. రాష్ట్రంలో కూలి రేట్లు ఒకే విధంగా ఉండాలని, కార్మికుల వయసు 58 నుంచి 65 వరకు పెంచాలని, ప్రభుత్వం పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పాత చట్టాలు రద్దు చేసి కొత్త చట్టాలు తీసుకురావాలని, రైతుల నుంచి కొంత సెస్ ద్వారా, కార్మికుల ద్వారా, ప్రభుత్వం ద్వారా కొంత జమ చేసి కార్మికులకు పెన్షన్ ఇచ్చేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలా చేయడం ద్వారా ప్రభుత్వానికి ఎలాంటి భారం పడకుండా ఉంటుందని, ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం విద్యా, వైద్యం, పెన్షన్‌తో పాటు గూడు కల్పించాలని కూనంనేని కోరారు.

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని తెలిపారు. గత 10 సంవత్సరాలలో మార్కెట్ యార్డ్ ఉందా లేదా అన్నట్టుగా ఉండేదని, రైతు బిడ్డను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన తర్వాత... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్కెట్ కళకళలాడుతోందని అన్నారు. మార్కెట్ యార్డ్ కార్మికులకు అండగా ఉంటామని, 130 ఇళ్లు లేవని నా దృష్టికి వచ్చిందని, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిటైర్‌మెంట్ వయసు 65 సంవత్సరాలకు పెంపు, పీఎఫ్, ఈఎస్ఐ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ప్రమాదంలో చనిపోయిన వారికి లక్ష రూపాయలు ఇచ్చేలా చూస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్ల సంఘం అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మార్కెట్‌లో లైసెన్సులు రెన్యువల్ చేయడం జరిగిందన్నారు. మార్కెట్ యార్డులో రైతులు, కార్మికుల కోసం ఉచిత భోజన క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ మాట్లాడుతూ శ్రమను ధారపోసి సంపదను సృష్టించేది కార్మికులని, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలన్నారు. పీఎఫ్ అమలు చేయాలని, వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. పనిలో ప్రమాదాలు జరుగుతున్నందున బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఇళ్లు లేని వారికి మార్కెట్ పరిసరాల్లో ఇళ్లు కట్టివ్వాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, అమ్మడానికి సరైన సౌకర్యాలు లేవని అన్నారు. కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీ ముందుంటుందని చెప్పారు.

అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతాం

- హైదరాబాద్ ఓల్డ్ కాదు ఒరిజినల్ సిటీ
- టూరిజంకు ప్రత్యేక పాలసీ
- పెట్టుబడులతో లాభాలు పొందండి
- రూ.15 వేల కోట్లతో ఎంఓయూ: సీఎం రేవంత్

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు... ఇది ఒరిజినల్ సిటీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... లాభాలు పొందండని పిలుపునిచ్చారు. "టూరిజం కాంక్లేవ్–2025" లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా టూరిజంకు ఒక పాలసీ లేదని, కానీ తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత టూరిజంకు ప్రత్యేక పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు. తెలంగాణలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, శాంతిభద్రతల విషయంలో సురక్షితమైన ప్రాంతమని, పెట్టుబడులకు రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో రూ.15 వేల కోట్ల పెట్టుబడులకు వివిధ సంస్థలు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. 50 వేల మందికి ఉపాధికి ఒప్పందాలు చేసుకున్నారు. వీటిల్లో 14 పీపీపీ ప్రాజెక్టులు (రూ7,081 కోట్లు), 16 ప్రైవేట్ రంగ ప్రాజెక్టులు (రూ. 8,198 కోట్లు) ఉన్నాయి.

పర్యాటకులకు స్వర్గసీమ: భట్టి

పర్యాటకులకు స్వర్గసీమ తెలంగాణ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గలగల పారే కృష్ణా, గోదావరి జీవనదులు... ఆకుపచ్చని సౌందర్యంతో నిండిన అటవీ ప్రాంతాలు... ప్రపంచాన్ని పర్యాటక రంగం ఆకర్షిస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. గత పాలకులు ప్రపంచ పటంలో తెలంగాణ పర్యాటక ఔన్నత్యాన్ని నిలబెట్టడంలో నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని సంస్కృతులను, ఆచారాలను అక్కున చేర్చుకుంటుందని వివరించారు. రాష్ట్రంలో ఉన్న మేధోసంపత్తి, అద్భుతంగా ఎదుగుతున్న సాఫ్ట్‌వేర్ రంగం, సినీ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది అన్నారు. వెల్ నెస్ సెంటర్లు, హాస్పిటల్ టూరిజం, ఎకో టూరిజం వంటి అద్భుత ఆదాయం సృష్టించే ప్రక్రియను పర్యాటక శాఖ చేపట్టింది అన్నారు. పెట్టుబడిదారుల సంక్షేమాన్ని, పర్యాటకుల రక్షణను తెలంగాణ ప్రభుత్వం కాంక్షిస్తుందని తెలిపారు.

సరిహద్దుల్లో అనంత శస్త్ర

న్యూఢిల్లీ: పాకిస్థాన్, చైనా సరిహద్దుల వద్ద రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భారత సైన్యం సిద్ధమవుతోంది. ఈ రెండు దేశాల సరిహద్దుల్లో వైమానిక రక్షణ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి భారత సైన్యం ఐదు నుంచి ఆరు రెజిమెంట్ల 'అనంత శస్త్ర' రక్షణ వ్యవస్థను కొనుగోలు చేయడానికి టెండర్ జారీ చేసింది. ఉపరితలం నుంచి గగనతల క్షిపణులను ఈ వ్యవస్థ ప్రయోగిస్తుంది. డీఆర్డీఓ తయారు చేసిన ఈ క్షిపణి వ్యవస్థను భారత సైన్యం కొనుగోలు చేయనుంది. దీనిని అంతకుముందు క్విక్ రియాక్షన్ సర్ఫేస్–టు–ఎయిర్ మిస్సైల్ అని పిలిచేవారు. భారత్ వద్ద ఇప్పటికే ఆకాశ్, మీడియం–రేంజ్ సర్ఫేస్–టు–ఎయిర్ మిస్సైల్ వంటి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. ఇది ఆపరేషన్ సిందూర్ సమయంలో సమర్థవంతంగా పనిచేశాయి. మే నెలలో ఆపరేషన్ సిందూర్ జరిగిన వెంటనే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ స్వదేశీ వైమానిక రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేయడానికి ప్రాజెక్ట్‌ను ఆమోదించింది. ఈ వ్యవస్థని పశ్చిమ, ఉత్తర సరిహద్దుల్లో మోహరించనుంది. ఈవ్యవస్థ కొనుగోలుకు రూ. 30,000 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ వ్యవస్థ భారత సైన్యం వాయు రక్షణను బలోపేతం చేస్తుందని, ఇది ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ డ్రోన్ దాడుల్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిందని సైన్యం తెలిపింది. అనంత శస్త్ర వైమానిక రక్షణ వ్యవస్థలు అత్యంత తేలికగా తరలించే అవకాశం ఉంటుంది. వీటిని త్వరగా ఫ్రంట్ లైన్‌లో మోహరించవచ్చు. ఇది కదలికలో లక్ష్యాలను శోధించే, ట్రాక్ చేయగలిగే సామర్థ్యాలను కలిగి ఉంది. దీని పరిధి 30 కి.మీ ఉంటుంది. ఈ వ్యవస్థ ఎంఆర్ సామ్, ఆకాశ్ వ్యవస్థలతో కలిసి పనిచేస్తుంది. దీనిని రాత్రి, పగలు వేళల్లో పరీక్షించారు.

'ఆపరేషన్ సిందూర్' ఆపాలని పాక్ వేడుకోలు

- ఐరాసలో పాక్ ప్రధాని నాటకాలు
- భారత్ శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి పెటల్ గెహ్లోత్

ఐరాస: ఆపరేషన్ సిందూర్ వేళ సైనిక ఘర్షణను ఆపాలంటూ పాకిస్థాన్ తమను ప్రాధేయపడిందని న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబీ 80వ సెషన్ వేదికగా భారత్ వెల్లడించింది. భారత్, పాక్‌లకు సంబంధించిన ఏ వ్యవహారంలోనైనా మూడో పక్షం జోక్యానికి అవకాశమే ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. ఐరాసలో భారత్ శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి పెటల్ గెహ్లోత్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ ఉగ్రమూకలు దాడి చేసినందుకే, భారత్ ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించిందని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా దాడి చేస్తే, బదులిచ్చే హక్కు భారత్‌కు ఉందన్నారు. దాన్నే తమ సైన్యం వినియోగించుకుందని పేర్కొన్నారు. ఏ అంశాన్నైనా ద్వైపాక్షిక చర్చలతోనే పరిష్కరించుకోవాలని చాలా ఏళ్ల క్రితమే భారత్, పాక్ అవగాహనకు వచ్చాయని ఆమె గుర్తు చేశారు. దీర్ఘకాలంగా భారత్ విధానం కూడా ఇదేనన్నారు. "ఆపరేషన్ సిందూర్ వేళ మే 9 వరకు భారత్‌కు పాకిస్థాన్ వరుస వార్నింగ్‌లు ఇస్తూ వచ్చింది. కానీ మే 10న పాక్ సైన్యం నేరుగా మమ్మల్ని ప్రాధేయపడింది. సైనిక ఘర్షణను ఆపాలని విన్నవించింది. భారత వాయుసేన దాడుల్లో పాక్‌లోని వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాక ఈ విన్నపం వచ్చింది. పాక్‌కు జరిగిన నష్టానికి సంబంధించిన ఫొటోలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. రన్ వేలు ధ్వంసమై, హ్యాంగర్స్ దహనమైనా పాక్ ప్రధానికి విజయంలా కనిపిస్తే, ఆ విజయాన్ని ఆయన ఎంజాయ్ చేయొచ్చు" అని గెహ్లోత్ అన్నారు.

'ది రెసిస్టన్స్ ఫ్రంట్'కు పాక్ ప్రధాని వత్తాసు

పాకిస్థాన్ ప్రధాని డ్రామాలను ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మరోసారి చూసిందని, పాక్ విదేశాంగ విధానంలో కేంద్ర బిందువుగా ఉన్న ఉగ్రవాదాన్ని షెహబాజ్ షరీఫ్ కొనియాడారని పెటల్ గెహ్లోట్ తెలిపారు. పాక్ ప్రధాని డ్రామాలతో వాస్తవాలను దాచిపెట్టలేరన్నారు. జమ్ముకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ 'ది రెసిస్టన్స్ ఫ్రంట్'కు వత్తాసు పలుకుతూ పాక్ ప్రధాని మాట్లాడారని ఆమె మండిపడ్డారు. ఆ సంస్థ ఉగ్రవాదులే భారతీయ టూరిస్టులను దారుణంగా చంపారని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలంగా ఉగ్రవాదులను తయారు చేయడం, వాళ్లను ఎగుమతి చేయడాన్నే పాక్ పనిగా పెట్టుకుంది. చివరకు ఆ దేశమే సిగ్గు లేకుండా తనకు నచ్చిన రీతిలో ఉగ్రవాదానికి, ఆ సంస్థలకు భాష్యం చెబుతుండటం విడ్డూరంగా ఉంది. ఉగ్రవాదంపై పోరులో భాగస్వామిగా ఉన్నామనే నాటకాలాడుతూ, ఒసామా బిన్ లాడెన్‌కు దశాబ్ద కాలం పాటు ఆశ్రయం ఇచ్చింది పాకిస్థానే అని మనం గుర్తుంచుకోవాలి. కొన్ని దశాబ్దాలుగా ఉగ్రవాద శిబిరాలను నిర్వహిస్తున్న విషయాన్ని పాక్ మంత్రులు ఇటీవలే ఒప్పుకున్నారు. పాక్ ద్వంద్వ విధానాలు కంటిన్యూ అవుతున్నాయి. ఈసారి పాక్ ప్రధాని స్థాయి వ్యక్తి నుంచి ఆ తరహా వ్యాఖ్యలు వచ్చాయి" అని పెటల్ గెహ్లోత్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా బహవల్‌పూర్, మురిద్కే ఉగ్రవాద శిబిరాలపై భారత బలగాలు దాడి చేశాయి. ఆ శిబిరాల్లో చనిపోయిన చాలామంది ఉగ్రవాదుల ఫొటోలను మేం చెక్ చేశాం. అలాంటి ఉగ్రవాదులకు పాక్ సైన్యం, అధికారులు బహిరంగంగా సంతాపం తెలిపారని, వారి గురించి గొప్పగా మాట్లాడారని, పాక్ ప్రభుత్వానికి ఉగ్రవాదంతో ఉన్న సంబంధాల గురించి సందేహమే అక్కర్లేదని గెహ్లోత్ వ్యాఖ్యానించారు. భారత్‌తో శాంతిని కోరుకుంటున్నామని చెబుతున్న పాక్ ప్రధానికి చిత్తశుద్ధి ఉంటే... వెంటనే ఉగ్రవాద శిబిరాలన్నీ పాక్ మూసేయాలి. వాంటెడ్ జాబితాలో ఉన్న ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు శుక్రవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలోకి వెళుతున్న క్రమంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ను భారత వార్తాసంస్థ 'ఏఎన్ఐ' ఓ ప్రశ్న అడిగింది.

యూపీలో 'ఐ లవ్ మహమ్మద్' ప్రచారం హింసాత్మకం

తౌకీర్ రజా ఖాన్ అరెస్టు

బరేలీ (యూపీ): బరేలిలో 'ఐ లవ్ ముహమ్మద్' ప్రచారం హింసాత్మకంగా మారడంతో యూపీ పోలీసులు తీవ్ర చర్యలు చేపట్టారు. ఈ ప్రచారానికి పిలుపు నిచ్చిన స్థానిక మతాధికారి, ఇత్తెహాద్–ఎ–మిల్లత్ కౌన్సిల్ చీఫ్ తౌకీర్ రజా ఖాన్‌ను శనివారం అరెస్టు చేశారు. బరేలిలో శుక్రవారం ప్రార్థనల అనం తరం ప్రదర్శకులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి జరిపారు. ఈ ఘటనలో కొందరు పోలీసులు గాయపడ్డారు. ఇందుకు బాధ్యుడని చెప్పబడుతున్న రజాతో సహా ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. పది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో ఎనిమిది ఎఫ్ఐఆర్‌లలో రజా నిందితుడుగా ఉండటం గమనార్హం. శుక్రవారం ప్రార్థనల అనంతరం పెద్దఎత్తున కొత్వాలి ఏరియాలోని మసీదు వెలుపల జనం గుమిగూడారు. 'ఐ లవ్ మహమ్మద్' పోస్టర్లు పట్టుకుని పోలీసులతో ఘర్షణకు దిగారు. రజా ప్రతిపాదించిన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించడం, చివరి నిమిషంలో ప్రదర్శన నిలిచిపోవడంతో ఆ గుంపు రెచ్చిపోయినట్టు చెబుతున్నారు.

జైలుకు రజా

హింసాత్మక ఘటనల అనంతరం రజాతో సహా 8 మందిని జైలుకు పంపినట్టు పోలీసులు తెలిపారు. రాళ్లు రువ్వడంతో పాటు విధ్వంసానికి పాల్పడిన మొత్తం 39 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతు న్నాయి. ఘటనా స్థలి నుంచి పిస్తోళ్లు, పెట్రోల్ బాటిల్స్, బాటన్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు బరేలీ ఎస్ఎస్‌పీ అనురాగ్ ఆర్య తెలిపారు. కాగా, హింసాత్మక దాడుల్లో 22 మంది పోలీసు సిబ్బంది గాయపడినట్టు ఎస్ఎస్‌పీ వివరించారు. వీరిలో పలువురు మారణా యుధాల కారణంగా గాయపడ్డారని, వైద్య పరీక్షలు జరుపుతున్నామని చెప్పారు. ఆందోళనకారులు కాల్పులు జరిపారనేది నిస్సందేహమన్నారు. 2500 మంది నుంచి 3000 మంది గుర్తుతెలియని వ్యక్తులు ఇందులో పాల్గొన్నారని, వారిని గుర్తించి పనిలో ఉన్నామని వివరించారు. నదీమ్ అనే వ్యక్తి ఫోన్ కాల్స్, వాట్సాప్‌తో అనేకమందితో సంప్రదింపులు జరిపినట్టు తెలిసిందని, ప్రస్తుతం పరారీలో ఉన్న అతని కోసం గాలిస్తున్నామని చెప్పారు.

'ఐ లవ్ మహమ్మద్' వివాదం

ఈనెల 4న 'ఈద్–ఇ–మిలాద్–ఉన్–నబి' ఊరేగింపు సందర్భంగా 'ఐ లవ్ మహమ్మద్' బోర్డులు ఉంచడంపై కాన్పూరు పోలీసులు కొరడా ఝుళిపించారు. 24 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సంప్రదాయానికి భిన్నంగా, రెచ్చగొట్టేందుకు ఈ బోర్డులు ఏర్పాటు చేశారంటూ పలు హిందూ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వివాదం ఉత్తరప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు పాకింది. ఉత్తరాఖండ్, కర్నాటకలో కూడా నిరసనలు వ్యక్తం కావడం, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయి. 'ఐ లవ్ మహమ్మద్' అనడం తప్పెలా అవుతుందని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు.

ముగిసిన ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- 23 బిల్లులకు ఆమోదముద్ర • 6 లఘు చర్చలు, 3 ప్రభుత్వ తీర్మానాలు
- మండలిలో 22 బిల్లుల ఆమోదం..ఒకటి రిజర్వు
- ఉభయ సభలు నిరవధికంగా వాయిదా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు శనివారంతో ముగిశాయి. అనంతరం శాసనసభ, శాసన మండలిని నిరవధికంగా వాయిదా వేశారు. ఈనెల 18వ తేదీ నుంచి 27 వరకు మొత్తం 8 రోజులపాటు శాసనసభ, శాసన మండలి సమావేశాలు కొనసాగాయి. ఉభయ సభల్లో వివిధ కీలక బిల్లులకు ఆమోదం లభించింది. శాసనసభ చైర్మన్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన 45 గంటల 53 నిముషాల పాటు సభా కార్యకలాపాలు జరిగాయి. మౌఖికంగా సమాధానం ఇచ్చిన నక్షత్రగుర్తు గల మొత్తం ప్రశ్నలు 55, మౌఖికంగా సమాధానాలు ఇచ్చిన స్వల్ప వ్యవధి ప్రశ్నలు 3 ఉన్నాయి. సభాసమక్షంలో ఉంచిన నక్షత్ర గుర్తు ప్రశ్నలు 71, నక్షత్ర గుర్తులేని ప్రశ్నలు 3, స్వల్ప వ్యవధి ప్రశ్నలు 1ఉన్నాయి. శాసన సభలో మొత్తం 23 బిల్లులను ప్రవేశపెట్టగా..ఆ మొత్తం ఆమోదం పొందాయి. 3 బిల్లులను సభ ఉపసంహరించింది. మొత్తం 120 మంది సభ్యులు ప్రసంగించారు. మండలిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్6తోపాటు వివిధ అంశాలపై ఆరు లఘు చర్చలు జరిగాయి. 74వ నియమం కింద రెండు చర్చలు కొనసాగాయి. ప్రభుత్వం తరపున 3 తీర్మానాలను ప్రవేశపెట్టారు. మంత్రుల నుంచి ఒక్క ప్రకటనే నమోదైంది. మరొకటి కమిటీ నివేదిక శాసనసభకు వచ్చింది. శాసనసభలో రాజకీయ పక్షాల బలాబలాలు మొత్తం 175 మంది సభ్యులు ఉన్నారు. వారిలో టీడీపీ 135, జనసేన 21, వైసీపీ 11, బీజేపీ 8 మంది ఉన్నారు.

శాసన మండలిలో చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు అధ్యక్షతన మొత్తం ఎనిమిది రోజులపాటు పనిదినాలు కొనసాగగా..22 గంటల 36 నిముషాల పాటు వివిధ పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడారు. మండలి ముందుకు మొత్తం 23 బిల్లులు రాగా..వాటిలో 22 బిల్లులకు మోదం లభించింది. చివరి రోజు...చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం కోసం చట్ట సవరణ చేసే ప్రతిపాదనకు చెందిన మరో బిల్లును వైసీపీ తిరస్కరించింది. దీంతో చట్ట సవరణ చేయకుండానే మండలి సమావేశాన్ని చైర్మన్ నిరవధిక వాయిదా వేశారు. 4 ప్రభుత్వ తీర్మానాలను మండలి ఆమోదించింది. మంత్రుల తరపున ఒకరు ప్రకటన చేశారు.

రైల్వేకు 61 లక్షలకు పైగా ప్రయాణికుల ఫిర్యాదులు

న్యూఢిల్లీ: రెండు ఆర్థిక సంవత్సరాల్లో రైల్వేకు 61 లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయి. రైళ్ల భద్రత, శుభ్రత, విద్యుత్ వైఫల్యాలపై ప్రయాణికులు ఎక్కువగా ఫిర్యాదు చేశారు. మధ్య ప్రదేశ్‌లోని నీముచ్‌కు చెందిన చంద్ర శేఖర్ గౌర్ దాఖలు చేసిన ఆర్టీఐ ప్రశ్నకు రైల్వే బోర్డు సమాధానం ఇచ్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రైల్వేకు సుమారు 32 లక్షల ఫిర్యాదులు అందినట్లు తెలిపింది. 2023–24లో నమోదయిన 28.96 లక్షల కంటే 11 శాతం మేర ఫిర్యాదుల సంఖ్య పెరిగినట్లు పేర్కొంది. రైలు సేవలపై ఫిర్యాదులు 18 శాతం పెరిగినప్పటికీ, రైల్వే స్టేషన్లకు సంబంధించిన ఫిర్యాదులు 21 శాతం మేర తగ్గాయని తెలిపింది. రైల్వే వ్యవస్థ మిశ్రమ పురోగతిని ఇది ప్రతిబింబిస్తున్నట్లు వెల్లడించింది. కాగా, ప్రయాణీకుల భద్రత అతిపెద్ద సమస్యగా ఉన్నట్లు రైల్వే తెలిపింది. రైళ్లలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు 64 శాతం పెరిగినట్లు పేర్కొంది. 2023–24 లో 4.57 లక్షల ఫిర్యాదులు అందగా 2024–25 లో ఈ సంఖ్య 7.50 లక్షలకు పెరిగిందని వివరించింది. రెండేళ్లలో రైళ్లలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు 12.07 లక్షలకు చేరుకున్నాయని, నమోదయిన ప్రతి నాలుగు ఫిర్యాదులలో భద్రతకు సంబంధించి ఒక ఫిర్యాదు ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు రెండేళ్లలో విద్యుత్ పరికరాల వైఫల్యాలకు సంబంధించి 8.44 లక్షల ఫిర్యాదులు, కోచ్‌ల శుభ్రతపై 8.44 లక్షల ఫిర్యాదులు అందాయి. నీటి లభ్యత, సిబ్బంది ప్రవర్తన, క్యాటరింగ్ సేవలపై ఫిర్యాదులు కూడా బాగా పెరిగాయి. అయితే రైళ్ల సమయపాలనకు సంబంధించిన ఫిర్యాదులు 15 శాతం మేర తగ్గాయి. 2023–24లో 3.25 లక్షల ఫిర్యాదులు నమోదు కాగా 2024–25లో 2.77 లక్షల ఫిర్యాదులు అందాయి. కాగా, స్టేషన్ స్థాయి ఫిర్యాదులు 2023–24లో 5.55 లక్షల నుంచి 2024–25లో 4.39 లక్షలకు తగ్గాయి.

'జీహెచ్ఎంసీ' పేదలకు
అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లు

విశాలాంధ్ర – హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లు అందిస్తామని రాష్ట్ర హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్ పురలో 344 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 30 నుంచి 70 గజాలున్నా అపార్ట్‌మెంట్ తరహా ఇళ్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. గత ఉప ఎన్నికల సమయంలో తాను ఇక్కడ మొండి గోడలతో ఉన్న ఇళ్లను పూర్తిచేసి ఇస్తానని మాట ఇచ్చానని దానిని నెరవేర్చామని తెలిపారు. నాటి ప్రభుత్వంలో దొరవారు పేదలకు ఇళ్లు కడితే కమీషన్లు రావని కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారించారని, ఏడాదికి లక్ష కట్టినా పదేళ్లలో పదిలక్షల ఇళ్లు పేదలకు వచ్చేవని అన్నారు. పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా తొలివిడతగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంకల్పించిందన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి నెలరోజులలోగా పేదలకు కానుకగా అందిస్తామని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో పేదలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా తాత ముత్తాతల నుంచి నివసిస్తున్న వారి భూములను ఫ్రీహోల్డ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున తగు సాయాన్ని అందిస్తామని, దీనికి ఎంపీ రాజేందర్ కేంద్రం నుంచి తగు ఆదేశాలు తేవాలని మంత్రి పొంగులేటి సూచించారు. శ్మశానవాటిక విషయంలో కూడా అనుమతులు సాధించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

పారా ఆర్చరీలో చరిత్ర సృష్టించిన శీతల్‌దేవి

ప్రపంచ నంబర్ వన్‌ను ఓడించి స్వర్ణ పతకం కైవసం

న్యూఢిల్లీ : దక్షిణ కొరియాలో జరుగుతున్న పారా ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో కౌంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించి 18 ఏళ్ల శీతల్ చరిత్ర సృష్టించింది. ఫైనల్‌లో తుర్కియేకు చెందిన ప్రపంచ నంబర్ వన్ ఓజ్నూర్ క్యూర్ గిర్డిపై 146–143 తేడాతో విజయం సాధించి, స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. అలాగే పురుషుల విభాగంలో తోమన్ కుమార్ విజేతగా నిలిచాడు. అంతకుముందు శీతల్, తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ ఈవెంట్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. గ్రేట్ బ్రిటన్‌కు చెందిన జోడీ గ్రిన్‌హామ్, నాథన్ మాక్‌క్వీన్‌ను 152– 149 తేడాతో ఓడించారు. కాంపౌండ్ మహిళల ఓపెన్ టీమ్ ఈవెంట్‌లో, ఫైనల్‌లో తుర్కియే చేతిలో ఓడిపోయిన తర్వాత శీతల్, సరిత రజతంతో సరిపెట్టుకున్నారు. అలాగే రాకేశ్ కుమార్ కాంపౌండ్ మెన్స్ విభాగం ఫైనల్‌లో 40–20 తేడాతో ఓడిపోయాడు. సాంకేతిక కారణాలతో అతడు వైదొలగాల్సి రావడంతో తోమన్ కాంపౌండ్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత రాకేశ్ నాలుగు షాట్స్ అనంతరం తన విల్లులో సమస్యతో పోటీ నుంచి వైదొలిగాడు. దీంతో తోమన్ నాలుగు సార్లు సరిగ్గా లక్ష్యాన్ని ఛేదించి ఈ విభాగంలో ప్రపంచ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.